

RNI NO.TGTEL/25/A5224

జోర్దార్

JORDAR TELUGU DAILY ధి తెలుగు దినపత్రిక

అవినీతి అంతం - మా పంతం



కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 288 గురువారం, నవంబర్ 05 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

పాఠశాల నిధుల ఖర్చులో 'స్పర్శ్' చిక్కులు!

పది శాతం కమీషన్‌తో కొత్త డిజిటల్ దందా?

- కరీంనగర్‌లో రిటైర్డ్ హెచ్‌ఎంపై తీవ్ర ఆరోపణలు..
- నెల రోజుల్లో రూ.2 కోట్ల లావాదేవీలంటూ ఫిర్యాదు

దందాకు తెరలేపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వస్తువులు కొనుగోలు చేయకుండానే అడ్వాన్స్ రసీదులు ఇచ్చేందుకు కొందరు వ్యాపారులు పది శాతం వరకు కమీషన్ వసూలు చేస్తున్నారని ఉపాధ్యాయ వర్గాలు ఆరోపిస్తున్నాయి. కరీంనగర్‌లో ఓ రిటైర్డ్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ రెండు కరెంట్ అకౌంట్లు తెరిచి, పాఠశాలలకు అవసరమైన వస్తువుల పేరుతో రసీదులు జారీ చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇంటి నుంచే వస్తువుల విక్రయాలు సాగిస్తూ, బిల్లుల వ్యవహారంలో కమీషన్లు తీసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి.



కరీంనగర్ (జోర్దార్ ప్రత్యేక ప్రతినిధి):
ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించే అరకొర నిధుల వినియోగం ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. పాఠశాలల నిర్వహణ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన 'స్పర్శ్' విధానం సరికొత్త చిక్కులకు దారితీస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో పీఎఫ్ఎంఎస్ విధానంలో ఉన్న నిధుల చెల్లింపులను ఈ ఏడాది స్పర్శ్‌కు అనుసంధానం చేయడంతో ఉపాధ్యాయులు అనేక నిబంధనల మధ్య సతమతమవుతున్నారు. పది వేల రూపాయల నిధుల వినియోగానికి పది రకాల కట్టుబాట్లు పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ముందస్తు చెల్లింపుల పేరుతో అవస్థలు

నిధుల వినియోగానికి ముందస్తు చెల్లింపులు, అడ్వాన్స్ పేమెంట్ రసీదులు, పాఠశాల కమిటీ తీర్మానాలు, కాంపైక్స్ హెచ్‌ఎంల అనుమతులు తప్పనిసరి చేయడంతో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవసరమైన వస్తువులు కొనుగోలు చేయడానికి ముందే సొంత డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. బిల్లులు సమర్పించడం, ట్రెజరీ ఆమోదం కోసం ఎదురుచూడటం, ఆ తర్వాత వస్తువులు కొనుగోలు చేసి మళ్లీ రసీదులు, స్టాక్ రిజిస్టర్లు సమర్పించడం వంటి ప్రక్రియలు ఉపాధ్యాయులకు అదనపు భారంగా మారాయి.

కమీషన్ల దందాకు తెరలేపారా?

ఈ విధానాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు కమీషన్ల దందాకు తెరలేపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వస్తువులు కొనుగోలు చేయకుండానే అడ్వాన్స్ రసీదులు ఇచ్చేందుకు కొందరు వ్యాపారులు పది శాతం వరకు కమీషన్ వసూలు చేస్తున్నారని ఉపాధ్యాయ వర్గాలు ఆరోపిస్తున్నాయి. కరీంనగర్‌లో ఓ రిటైర్డ్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ రెండు కరెంట్ అకౌంట్లు తెరిచి, పాఠశాలలకు అవసరమైన వస్తువుల పేరుతో రసీదులు జారీ చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇంటి నుంచే వస్తువుల విక్రయాలు సాగిస్తూ, బిల్లుల వ్యవహారంలో కమీషన్లు తీసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి.

రూ.2 కోట్ల లావాదేవీలపై విచారణ డిమాండ్

సదరు రిటైర్డ్ ఉద్యోగి నెల రోజుల్లోనే సుమారు రూ.2 కోట్ల మేర లావాదేవీలు నిర్వహించినట్లు, అందులో పది శాతం చొప్పున దాదాపు రూ.20 లక్షల కమీషన్ పొందినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఈ వ్యవహారంపై దుకాణదారుల సంఘం ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి నుంచే వ్యాపారం నిర్వహించడం, జీఎస్టీ నిబంధనలు పాటించకపోవడం వంటి అంశాలపై విజిలెన్స్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని సంఘం కోరినట్లు తెలిసింది. అయితే ఈ ఆరోపణలపై అధికారిక విచారణలో వాస్తవాలు తేలాల్సి ఉంది.

బడికి కావాల్సిన వస్తువులు కొనేదెలా?

బ్లీచింగ్ పౌడర్, జిరాక్స్, హ్యాండ్‌వాష్, చీపుర్లు, ఫినాయిల్, జెండా వందనం స్వీట్లు, ఇతర నిర్వహణ సామగ్రి కొనుగోలుకు ముందుగా డబ్బులు ఎక్కడి నుంచి తీసుకురావాలని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాలల్లో కూలీలతో పనులు చేయిస్తే బిల్లులు ఎవరు ఇస్తారని, ఒకేసారి నిధుల ఖర్చుకు గడువు విధిస్తే ఏడాది పొడవునా అవసరాలను ఎలా

ఉపాధ్యాయ సంఘాల మౌనంపై అసంతృప్తి

ఉపాధ్యాయుల సమస్యలపై స్పందించాల్సిన గెజిటెడ్ హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఈ వ్యవహారంలో మౌనం వహించడం పట్ల ఉపాధ్యాయ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మరోవైపు ప్రీప్రైమరీ పథకం కింద విడుదలైన నాలుగు నెలల టీచర్లు, ఆయాల వేతనాల బిల్లులు మండల విద్యాధికారులు సమర్పించి 15 రోజులు గడుస్తున్నా ఇంకా ఈ-కుబేర్‌లో పెండింగ్‌లోనే ఉన్నాయని చెబుతున్నారు. ఒకవైపు వేతనాల చెల్లింపుల్లో జాప్యం, మరోవైపు పాఠశాల నిధుల వినియోగంలో స్పర్శ్ నిబంధనలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పర్శ్ విధానాన్ని పునఃసమీక్షించాలి

పాఠశాలలకు నిధులు కేటాయించి వాటిని ఖర్చు చేసేందుకు ఇన్ని ఆంక్షలు విధించడం వల్ల ప్రయోజనం ఏమిటని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. కమీషన్ల ఆరోపణలపై విజిలెన్స్ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద బిల్లులను పరిశీలించి అవసరమైతే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. స్పర్శ్ విధానాన్ని తక్షణమే పునఃసమీక్షించి, ఉపాధ్యాయులకు ఇబ్బందులు లేకుండా సరళమైన విధానాన్ని అమలు చేయాలని కోరుతున్నారు. ఉపాధ్యాయులపై నమ్మకం లేకుంటే పాఠశాలల వారీగా అవసరాల జాబితా సేకరించి ప్రభుత్వమే నేరుగా వస్తువులు సరఫరా చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

తెలంగాణ వ్యవసాయ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఏఈఓలకు జీతాల వచ్చేది ఎన్నడో??

19 నెలలుగా వేతనం అందని ఓ ఏఈఓ.. 39 మందికి పెండింగ్‌లో జీతాలు



(జోర్దార్ హైదరాబాద్ అగ్రికల్చర్ బ్యూరో చీఫ్) తెలంగాణ వ్యవసాయ శాఖలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులకు (ఏఈఓలకు) వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాల్సి ఉండగా, నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 366 మంది ఔట్‌సోర్సింగ్ ఏఈఓలు పనిచేస్తుండగా, వారిలో 39 మందికి జీతాలు పెండింగ్‌లో ఉన్నట్లు ఉద్యోగ వర్గాల సమాచారం. ఓ ఏఈఓకు ఏకంగా 19 నెలలుగా వేతనం అందకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. వరంగల్, నల్లగొండ జిల్లాలు మినహా ఇతర ప్రాంతాల్లోనూ ఈ సమస్య ఉన్నట్లు తెలుస్తోంది.జీతాలు అందక కుటుంబ పోషణ, అప్పుల చెల్లింపులు, రోజువారీ ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నామని బాధిత ఉద్యోగులు వాపోతున్నారు. రైతులకు సేవలందిస్తున్న తమ వేతనాల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందికి ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలన్న ముఖ్యమంత్రి హామీ వ్యవసాయ శాఖలో అమలుకు నోచుకోవడం లేదని విమర్శిస్తున్నారు.పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేసి, ఇకపై ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఔట్‌సోర్సింగ్ ఏఈఓలు కోరుతున్నారు.

ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు

వణికిపోతున్నారు



- కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ ఘాటు విమర్శలు
- కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ, బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు
- తెలంగాణకు కేంద్రం ఏం ఇచ్చిందని అమిత్ షాను ప్రశ్నించిన కేటీఆర్
- రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలపై విమర్శలు

హైదరాబాద్:కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు అన్యాయం చేస్తున్న పార్టీలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే.. బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు.అమిత్ షా హైదరాబాద్‌కు వస్తే బండి సంజయ్ బాడీగార్డ్‌లా వ్యవహరించారని కేటీఆర్ విమర్శించారు. ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ కరీంనగర్ ప్రజల గౌరవాన్ని దిగజార్చవద్దని హితవు పలికారు. తనకంటే చిన్నవాడైన అమిత్ షాకు రాంచందర్‌రావు కాళ్లకు నమస్కరించడమేంటని ప్రశ్నించారు. అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారని, రాష్ట్రానికి ఏం ఇచ్చారని కేటీఆర్ నిలదీశారు. ఒక్క మెట్రో ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు లేదా విద్యాసంస్థనైనా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసమే తాపత్రయపడుతున్నారని విమర్శించారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళుతూ ఆయన 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా మారిపోయారని ఎద్దేవా చేశారు. అడవులు నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేసినట్లుగా.. భూములు అమ్మే బ్రోకర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఎలా ఉంటుందో అలా ఉందని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.


వైద్య కళాశాలలో వసతులేవీ..?

నాలుగేళ్లుగా తాత్కాలిక భవనమే దిక్కు!

హామీలు అమలేది? వసతి, భోజనం, మరుగుదొడ్లు, రవాణా సౌకర్యాలపై ప్రశ్నలు

హైదరాబాద్ జోర్దార్ నిఘా విభాగం

2023లో ప్రారంభమైన జి.ఎం.సి. వి.కె.బి. వైద్య కళాశాలలో మౌలిక వసతుల కల్పన ప్రశ్నార్థకంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు నెలల్లో శాశ్వత భవనంలోకి మారుస్తామన్న హామీ నాలుగేళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చలేదనే చర్చ సాగుతోంది. సొంత వసతి గృహం లేక బాలికలు కేంద్ర ప్రభుత్వ ఆయుష్ ఆసుపత్రి భవనంలో ఒక గదికి 16--17 మంది చొప్పున ఉంటున్న పరిస్థితి ఉందని తెలుస్తోంది. నాలుగు బ్యాచ్‌లకు రెండు ఉపన్యాస మందిరాలే ఉండటం, కళాశాల ప్రాంగణంలో మరుగుదొడ్లు లేకపోవడం, పోస్టింగ్‌లకు వెళ్లేందుకు రవాణా సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు విద్యార్థులకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. సుమారు 300 మంది విద్యార్థులు ఆర్టీసీ బస్సులపై ఆధారపడుతుండగా, బస్సులు సైతం సరిగా ఆగడం లేదనే విమర్శలున్నాయి.మరోవైపు రెండు నెలలుగా భోజనశాల సేవలు నిలిచిపోవడంతో విద్యార్థులు బయట నుంచి ఆహారం తెచ్చుకోవడం లేదా వసతి గృహాల్లోనే వండుకోవాల్సిన పరిస్థితి నెలకొందని సమాచారం. కొత్త గుత్తేదారును నియమించే ప్రక్రియ ముందుకు సాగకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గదుల్లో వంట చేసుకోవడానికి వినియోగిస్తున్న ప్లగ్ పాయింట్లను తొలగించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ దీన్ దయాళ్ బంగ్ ఆదేశించినట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. కళాశాలలో నెలకొన్న సమస్యలపై పలుమార్లు విన్నవించినా పరిష్కారం దిశగా స్పందన కనిపించడం లేదనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించడంలో జాప్యంపై విద్యా, ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



RNI NO.TGTEL/25/A5224
జోర్దార్ JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

భారీ వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

■ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



భద్రాద్రి కొత్తగూడెం,(జోర్దార్ ప్రతినిధి)అశ్వారావుపేట నియోజకవర్గంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వర రావు సూచించారు. వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లే ప్రమాదం ఉన్నందున వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని కోరారు. ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లి ఫొటోలు, వీడియోలు తీయడం వంటివి చేయరాదని హెచ్చరించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షించాలని,పార్టీ నాయకులు, కార్యకర్తలు వర్ష బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు.

ముఖ్యనాథస్వామి ఆలయ తృతీయ

వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



కాజీపేట(జోర్దార్ ప్రతినిధి)ముప్పారం గ్రామంలోని కాకతీయుల కాలం నాటి ప్రాచీన శ్రీ ముఖ్య నాథ స్వామి దేవాలయ పునఃప్రాణ ప్రతిష్ఠ జరిగి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తృతీయ వార్షికోత్సవ పోస్టర్‌ను బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జివికె కన్సల్టెన్సీ సీఈఓ వినోద్ కుమార్, రీజినల్ డైరెక్టర్ గీత రాజేష్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆలయ పునఃవ్యవస్థాపకులు శివ సాని ప్రవీణ్ రవీంద్ర మాట్లాడుతూ.. ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్న వార్షికోత్సవాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రహోమాలు, స్వామివారి కళ్యాణ మహోత్సవం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాళ్లపల్లి కుమారస్వామి,
పంచాయతీ కార్యదర్శి ఆకారపు సురేష్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొన్నె రవీందర్ రెడ్డి, గౌరవ సలహాదారులు గొట్టిముక్కుల సురేష్ కుమార్, కాశిరెడ్డి రాజిరెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా

గుస్సాడీ దండారి ఉత్సవాలు

■ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా ప్రారంభం

■ పది రోజుల పాటు సంబరాలు



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గుస్సాడీ దండారి ఉత్సవాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వైభవంగా ప్రారంభ మయ్యాయి. గిరిజన గ్రామాల్లో పది రోజుల పాటు సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. డోలు, సన్నాయి వాయిద్యాల మోతలు, గుస్సాడీ నృత్యాలు, కోలాటాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.
రాజ్ గోండుల వంశపారంపర్య సంప్రదాయంగా వస్తున్న ఈ ఉత్సవాలను ఆశ్వయుజ, కార్తీక మాసాల్లో దీపావళికి ముందు నిర్వహిస్తారు. నెమలీకలతో అలంకరించిన పెద్ద టోపీలు, వనమూలికల మాలలు, కాళ్లకు గజ్జెలు ధరించి కళాకారులు లయబద్ధంగా నృత్యాలు చేస్తారు. తొలిరోజు అకాడ పండుగలో భాగంగా నెమలీకలు, డోలు, ఇతర వాయిద్యాలకు భోగి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోనాల, జాతర్ల, మత్తడి, లోకారి, చెంచుఘాట్ తదితర గ్రామాల్లో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.
దండారి ఉత్సవాల్లో భాగంగా ఒక గ్రామానికి చెందిన బృందాలను మరో గ్రామానికి చెందిన ఆదివాసులు సంప్రదాయబద్ధంగా ఆహ్వానించి గౌరవించడం ఆనవాయితీ. ఈ వేడుకల ద్వారా గ్రామాల మధ్య సాంస్కృతిక సంబంధాలు మరింత బలపడు తున్నాయి.నిధులు విడుదల చేయాలని ఆదివాసుల విజ్ఞప్తి మరోవైపు ఉత్సవాలకు ప్రభుత్వ ప్రోత్సాహం అందడం లేదని ఆదివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 178 దండారి, గుస్సాడీ బృందాలు పాల్గొంటుండగా, ఒక్కో బృందానికి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. అయితే గత రెండేళ్లుగా నిధులు అందలేదని పేర్కొన్నారు. గత నెల 13న ఉత్సవాల కోసం రూ.3 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, నిధులు ఇంకా ఐటీడీఏలకు చేరలేదని తెలిపారు.ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాజ్ గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విశ్వం రావు కోరారు.

ఆదిలాబాద్ జిల్లాలో

ఏసీబీకి చిక్కిన ఎస్ఐ



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఆదిలాబాద్ జిల్లాలో అవినీతి అధికారుల జాబితా పెరుగుతోంది. లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ ఎస్ఐ రమేష్ చిక్కారు. ఓ కేసులో రూ.50 వేలు లంచం డిమాండ్ చేసిన ఎస్ఐ రూ.40 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. సదరు వ్యక్తి నుంచి రూ.40 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆయనను పట్టుకున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ

ఓటరు నమోదు కార్యక్రమం పరిశీలన



హసన్‌పర్తి ,(జోర్దార్ ప్రతినిధి)హసన్‌పర్తి మండలంలోని అర్వపల్లి, భైరాన్‌పల్లి, సిద్ధాపురం గ్రామాల్లో నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు ప్రక్రియ, అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునే విధానాన్ని పరిశీలించారు. పట్టభద్రులందరూ ఓటరు నమోదుపై అవగాహన కలిగి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ఇన్‌చార్జి, మాజీ డిప్యూటీ మేయర్ మసూద్,
హసన్‌పర్తి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీకుమార్, పీఏసీఎస్ చైర్మన్ మాజీ జక్కు రమేష్ గౌడ్, క్రాంతి, అభి లాష్, మాజీ సర్పంచ్ ఈశ్వరమ్మ, చీకటి రమేష్, రాజకుమార్, బండి అనుదీప్, అవినాష్, బండి ప్రవీణ్, వార్డు సభ్యుడు అభిలాష్, రామకృష్ణ, శేఖల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సీఎం హామీ

■ ఈ నెల 15లోపు కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందేలా చర్యలు



హైదరాబాద్,జోర్దార్ ప్రతినిధి:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఎమ్మెల్సీ పాల్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పేరి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఉస్మాన్ పాషా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ముఖ్య మంత్రికి అందజేశారు.
ఉద్యోగులు, పెన్షనర్లకు ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందే పీఆర్సీ ప్రకటించాలని, పదవీ విరమణ చేసిన వారికి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం ద్వారా ఎంప్యానెల్డ్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందించాలని, వైద్యం నిరాకరించే ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ పెన్షనర్ల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.
ముఖ్యంగా ఈ నెల15వ తేదీలోపు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు చర్య లు తీసుకుంటామని స్పష్టం చేశారు.
ముఖ్య మంత్రి హామీపై సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీలు



■ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి లిడాక్టర్ అప్పయ్య

హనుమకొండ,జోర్దార్ ప్రతినిధి:జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య వంగర, ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఫార్మసీలో మందుల నిల్వలు, ల్యాబొరేటరీ రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించి, రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సిబ్బందికి సూచించారు.అనంతరం మాతా శిశు ఆరోగ్య సేవలు, సాధారణ టీకాలు, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాల అమలును సమీక్షించి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు విస్తృతంగా వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధిగ్రస్తులకు సకాలంలో చికిత్స అందించాలని తెలిపారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.
డెంగ్యూ, మలేరియా వంటి కీటక జనిత వ్యాధుల నివారణకు పారిశుద్ధ్య చర్యలు, యాంటీ లార్వా ఆపరేషన్లు చేపట్టడంతో పాటు ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ అప్పయ్య సూచించారు.ఈ తనిఖీల్లో వంగర వైద్యాధికారులు డాక్టర్ రహమాన్, డాక్టర్ రూబీనా, ముల్కనూర్ వైద్యాధికారి డాక్టర్ ముజీబ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేవళిక కుటుంబానికి న్యాయం చేయాలి



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:మణుగూరు డిపోకు చెందిన కండక్టర్ ప్రవళిక మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం డిపో ఎదుట నిరసన తెలిపారు. ప్రవళిక మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. చిల్లర డబ్బుల విషయమై ఓ ప్రయాణికురాలు బస్సు నుంచి ప్రవళికను తోసేయడంతో ఆమె తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందారు.
బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

ఆదిలాబాద్ రిమ్స్‌లో

నాలుగు వెంటిలేటర్లు చోరీ



■ 30 లక్షల విలువైన వైద్య పరికరాలు అపహరణ

■ సీసీ కెమెరాల్లో రికార్డైన దృశ్యాలు

ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో భద్రతా వైఫల్యం వెలుగుచూసింది. ఆసుపత్రిలోని ఆర్ఐసీయూ వార్డులోకి చొరబడిన దుండగులు సుమారు రూ.30 లక్షల విలువైన నాలుగు వెంటిలేటర్లను అపహరించారు. గత నెల 30న పట్టపగలే ఈ చోరీ జరిగినట్లు తెలుస్తోంది. దొంగలు వెంటిలేటర్లను తీసుకెళ్తున్న దృశ్యాలు ఆసుపత్రిలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. చోరీ జరిగిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయకుండా ఆసుపత్రి అధికారులు ఆలస్యంగా ఆదిలాబాద్ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడం అనుమానాలకు తావిస్తోంది. దీంతో రిమ్స్‌లో భద్రతా ఏర్పాట్లు, అధికారుల పర్యవేక్షణపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితుల కోసం దర్యాప్తు చేపట్టారు. అత్యవసర రోగులకు ఉపయోగపడే వెంటిలేటర్లే చోరీకి గురికావడంతో ఆసుపత్రి భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.

కస్తూర్బా విద్యాలయానికి 2 లక్షల

చపాతీ తయారీ యంత్రం



ముత్తారం,(జోర్దార్ ప్రతినిధి)మంత్రి శ్రీధర్ బాబు మార్గదర్శకత్వంలో తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ స్టేట్ అడిషనల్ డైరెక్టర్ బర్ల రాజు ప్రత్యేక చొరవతో ముత్తారం కస్తూర్బా బాలికల విద్యాలయానికి రూ.2 లక్షల విలువైన చపాతీ తయారీ యంత్రాన్ని అందించనున్నారు. ఈ యంత్రం గంటకు 500 చపాతీలు తయారు చేసే సామర్థ్యం కలిగి ఉంది. దీంతో విద్యార్థినులకు ఆహార తయారీలో సౌకర్యం కలగనుంది. ఈ సందర్భంగా బర్ల రాజు కృషిని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. కార్యక్రమంలో అడవి శ్రీరాంపూర్ ఉపసర్పంచ్ అనవేన హరిత-తిరుపతి పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



భీమదేవరపల్లి జోర్దార్ విలేఖరి:తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ భీమదేవరపల్లి మండలం నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించగా, మండల అధ్యక్షుడిగా రామంచ బిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా కాతేసి కొమురయ్య, ఉపాధ్యక్షుడిగా పూధారి రమేష్, కోశాధికారిగా అనిల్ ప్రతాప్, కార్యదర్శిగా ఏ. శంకర్ రెడ్డి ఎన్నికయ్యారు.
ఈ ఎన్నికల కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు చందుపట్ల రాజేంద్రం ఎన్నికల అధికారిగా , పరిశీలకులుగా ఎప్పా కుమారస్వామి, జిల్లా అధ్యక్షుడు బత్తిని రామాంజనేయులు, ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు బి. సారయ్య నాయక్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం, విద్యారంగ అభివృద్ధి కోసం, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం కోసం టీపీటీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు, సంఘం అభివృద్ధికి ఐక్యంగా పనిచేయాలని ఆకాంక్షించారు.నూతన కార్యవర్గ సభ్యులు తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞ తలు తెలియజేస్తూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన

టీజేఎస్ రాష్ట్ర కమిటీ



హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ కోదండరాం నాయకత్వంలో టీజేఎస్ రాష్ట్ర కమిటీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న పలు సమస్యలతో పాటు స్థానిక సమస్యలను చర్చించినట్లు తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముక్కెర రాజు తెలిపారు.

అల్పినో కారణంగా ఇబ్బంది పడుతున్న రైతులను ఆదుకోవాలని విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ ఉద్యమకారుల కోసం తగిన సహాయక చర్యలను తీసుకోవాలని పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తిచేయాలని ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని వారు

ముఖ్యమంత్రిని కోరగా దానికి సాను కూలంగా స్పందించిన ముఖ్యమంత్రి అన్ని సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ముక్కెర రాజు తెలిపారు.

హుజురాబాద్ క్లబ్ ఎన్నికలు రసవత్తరం

బరిలో ఆశావహులు

■ 15న ఎన్నికలు

హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:హుజురాబాద్ క్లబ్ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. బుధవారం నామినేషన్ల ప్రక్రియ ముగియగా వివిధ పదవులకు భారీ సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. సెక్రటరీ పదవికి 4, ఉపాధ్యక్ష పదవులకు 7, సహాయ కార్యదర్శులకు 5, కోశాధికారికి 3, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా 26 నామినేషన్లు వచ్చాయి. గురువారం నామినేషన్ల పరిశీలన, శుక్రవారం ఉపసంహరణ ప్రక్రియ అనంతరం తుది అభ్యర్థుల జాబితా విడుదల చేయనున్నారు.ఈ నెల 15న ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నారు.దాదాపు 40--50 ఏళ్లుగా దివంగత రాజ్యసభ సభ్యుడు ఒడితల రాజేశ్వరరావు క్లబ్కు సేవలందించగా, ఆయన మరణానంతరం మాజీ రాజ్యసభ సభ్యుడు, మాజీ మంత్రి కెప్టెన్ ఒడితల లక్ష్మీకాంతారావు నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రత్యేక శ్రద్ధతో క్లబ్ను అభివృద్ధి చేసి ఆధునిక సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుతం క్లబ్లో 339 మంది సభ్యులు ఉండగా,ఇండోర్ షటిల్ కోర్టు, టెన్నిస్ కోర్టు, ఫంక్షన్ హాల్, స్విమ్మింగ్ పూల్, జిమ్ తదితర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.



గత 15 ఏళ్లుగా నామినేటెడ్ విధానంలో కార్యవర్గాన్ని ఎంపిక చేస్తుండగా, తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికలు జరగనుండటంతో సభ్యుల్లో ఆసక్తి నెలకొంది. ఈ ఎన్నికల్లో సభ్యులు రెండు వర్గాలుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒక వర్గానికి మల్లారెడ్డి, వర్ధని రవీందర్రావు నాయకత్వం వహిస్తుండగా, మరో వర్గానికి ముత్య నారాయణరెడ్డి సారథ్యం వహిస్తున్నారు. సెక్రటరీ పదవికి మల్లారెడ్డి, ముత్య నారాయణరెడ్డి నామినేషన్లు దాఖలు చేయడంతో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.రెండు వర్గాల సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతారావును కలిసి క్లబ్ పరిస్థితులు, ఎన్నికల అంశాలను వివరించినట్లు సమాచారం. కొత్తవారికి కూడా అవకాశం కల్పిస్తూ గ్రూపు విభేదాలు లేకుండా క్లబ్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని సభ్యులు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది.ఈ నెల 15న జరగనున్న ఎన్నికల్లో సభ్యులు ఎవరికి పట్టం కడతారన్నది హుజురాబాద్లో చర్చనీయాంశంగా మారింది.

బీసీ జన ఘణనలో ఓ బి సి కాలం ఏర్పాటు చేయాలి

■ జాతీయ బీసీ కమిషన్ చైర్ పర్సన్ కు విజ్ఞప్తి చేసిన, జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు.



మంచిర్యాల జోర్దార్ జిల్లా ప్రతినిధి:కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న,బీసీ జనగణనలో ఓబీసీ కాలాన్ని చేర్చి, కులానికి ఒక యూనిక్ కోడ్ పెట్టే విధంగా, కేంద్ర ప్రభుత్వానికి సిఫారసులు చేయాలని, జాతీయ బీసీ కమిషన్ చైర్ పర్సన్ సాద్వి నిరంజన్ జ్యోతికి మంచిర్యాల జిల్లా జాతీయ బీసీ పోరాట సమితి నాయకులు బుధవారం విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా స్థానిక ఇస్లాంపూర్ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 80 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ,ఏ ప్రభుత్వం సమగ్రంగా బీసీ కులగణన చేపట్టకపోవడం విచారకరమనీ,ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంట్ సాక్షిగా కులగణన చేపడతామని ప్రకటించి, ప్రస్తుతం నిర్వహిస్తున్న జనగణనలో ప్రత్యేకంగా ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేయకపోవడం బీసీ సమాజానికి అన్యాయం చేయడమేనని అన్నారు.

జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చి బీసీల జనాభా లెక్కలు సేకరిస్తే, జనాభా దామాషా ప్రకారం బీసీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, విద్యా, ఉద్యోగ, ఉపాధి, రంగాల్లో తగిన అవకాశాలు కల్పించాల్సి వస్తుందనే ఉద్దేశంతో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.దేశంలోని అన్ని వర్గాల జనాభా వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వాలు బీసీల విషయంలో మాత్రం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమనీ, బీసీలకు రావాల్సిన సామాజిక, రాజకీయ వాటాను ఇంకా ఎన్నాళ్లు దూరం చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం చేపడుతున్న జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చడంతో పాటు ప్రతి బీసీ కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించే విధంగా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సులు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బీసీల న్యాయమైన డిమాండ్ లను గుర్తించి జనగణనలో ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేసి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, కార్యదర్శి పెద్దల చంద్రకాంత్, రాష్ట్ర నాయకులు గజెల్లీ వెంకటయ్య, కడారి సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన

బీఆర్ఎస్ మండల నాయకులు



టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:టేకుమట్ల మండలంలోని పంగిడిపల్లి గ్రామానికి చెందిన లెక్కల మనమ్మ, సోనపెల్లి గ్రామానికి చెందిన అబెంగుల లక్ష్మయ్య మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ మండల నాయకులు, మాజీ ఎంపీపీలు రెడ్డి మల్లారెడ్డి, బండేల నరేష్ పరామర్శించి సానుభూతి తెలిపారు. అలాగే రాఘవపురం గ్రామానికి చెందిన డీలర్ రవీందర్ తండ్రి కొండ్ర రాయమల్లు సంవత్సరిక కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోండ్ర ఓదెలు, సర్పంచ్ రమా దేవేందర్, మాజీ సర్పంచ్ ఉద్ధమారి మహేష్, రాజయ్య, సాద మహేందర్, శ్రీకాంత్, కాసర్ల సంతోష్రెడ్డి, రగోతం రెడ్డి, రాంరెడ్డి, రాజ నరేందర్రెడ్డి, బొల్లు శరత్నం రెడ్డి, చెరుకు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలు చేతికొచ్చే వేళ నీటి కొరత

డీబీఎం-38 ద్వారా సాగునీరు విడుదల చేయాలి

భూపాలపల్లి జోర్దార్ ప్రతినిధి:భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని రైతులకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్పీ) నుంచి డీబీఎం-38 కాలువ ద్వారా వెంటనే సాగునీరు విడుదల చేయాలని సీపీఐ ఎంఎల్ భూపాలపల్లి జయశంకర్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రైతులు అప్పులు చేసి వరి, పత్తి పంటలు సాగు చేశారని, ప్రస్తుతం పంటలు కీలక దశలో ఉన్నాయని తెలిపారు. ఈ సమయంలో సాగునీరు అందకపోతే పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత సాగునీటి శాఖ అధికారులతో మాట్లాడి డీబీఎం-38 కాలువ ద్వారా అవసరమైన నీటిని విడుదల చేయించాలని విజ్ఞప్తి చేశారు. పంటలు ఎండిపోయిన తర్వాత స్పందించడం వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని, ఇప్పుడే సాగునీరు అందించి పంటలను కాపాడాలని మారపల్లి మల్లేష్ ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను కోరారు.

పంట రుణాల పునర్వ్యవస్థీకరణ

గడువు పొడిగింపునకు కలెక్టర్ ఆదేశాలు



వరంగల్,జోర్దార్ ప్రతినిధి:కరువు ప్రభావిత మండలాల రైతులకు బ్యాంకుల ద్వారా ఆర్థిక ఉపశమన చర్యలు సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బ్యాంకు అధికారులను ఆదేశించారు.

బుధవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశంలో రైతులకు అందించాల్సిన సహాయంపై సమీక్షించారు. పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, రుణ చెల్లింపు గడువు పొడిగింపు, మారటోరియం సదుపాయం, తదుపరి వ్యవసాయ సీజన్కు కొత్త రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.ప్రభుత్వ శాఖలు, బ్యాంకులు సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన రైతులను గుర్తించి, నిబంధనల ప్రకారం ఉపశమన చర్యలు అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కిషోర్, బ్యాంకు అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు

వేముగంటి శ్యాం ప్రసాదరావు కన్నుమూత

■ పలువురు ప్రముఖుల సంతాపం



హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:తెలంగాణ ప్రాంత ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వేముగంటి శ్యాంప్రసాదరావు (86) మంగళవారంకన్ను మూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బీబీనగర్ ఎయిమ్స్లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో పర్వేద గ్రామం, హుజూరాబాద్ ప్రాంతంలో విషాదం నెలకొంది.పర్వేద గ్రామానికి చెందిన శ్యాంప్రసాదరావు చిన్నతనం నుంచే నిజాం వ్యతిరేక పోరాటంతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. జీవితాంతం ప్రజాసేవ, సామాజిక విలువలకు ప్రాధాన్యతనిచ్చారు. ఆయన మృతిపట్ల మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వి. లక్ష్మీకాంతారావు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీష్ కుమార్, దాస్యం వినయ్ భాస్కర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

హలో మాదిగ..చలో భూపాలపల్లి!

■ ఈ నెల 6న ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ జిల్లా కమిటీ సమావేశం..

■ భారీగా తరలిరావాలని పిలుపు



టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నెల 6న భూపాలపల్లిలో నిర్వహించనున్న ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ జిల్లా కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్పీఎస్ జిల్లా నాయకులు రామ్, రామచందర్ మాదిగ, టేకుమట్ల మండల అధ్యక్షుడు మచ్చ శ్రీకాంత్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టేకుమట్ల మండలంలోని మాదిగలు, విద్యార్థులు, ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ నాయకులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

■ కుటుంబానికి అండగా నర్సింగరావు

మొగుళ్లపల్లి,జోర్దార్ ప్రతినిధి:మండలంలోని కొర్కిశాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దానవేని రాములు కుమారుడు జస్వంత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని సొసైటీ చైర్మన్ నర్సింగరావు అన్నారు. గ్రామానికి వెళ్లి జస్వంత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్న వయసులోనే మృతి చెందడం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో రాములు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుడి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.

జిల్లాస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్లో

190 ప్రాజెక్టుల ప్రదర్శన



■ రాష్ట్రస్థాయికి 8 ప్రాజెక్టులు ఎంపిక

■ నాలుగింటికి కన్సోలేషన్ బహుమతులు

వరంగల్,జోర్దార్ ప్రతినిధి:వరంగల్ జిల్లాలో 32వ జిల్లాస్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ బుధవారం ఖిలా వరంగల్లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా సైన్స్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ డాక్టర్ కట్ల శ్రీనివాస్, మండల విద్యాధికారి వెంకటయ్య పాల్గొన్నారు.జిల్లావ్యాప్తంగా 190 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. న్యాయనిర్ణేతలు ప్రాజెక్టులను పరిశీలించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 8 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించడమే సైన్స్ కాంగ్రెస్ లక్ష్యమని ప్రొఫెసర్ వెంకయ్య అన్నారు. స్థానిక సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు కనుగొనేలా విద్యార్థులను ప్రోత్సహించాలని డాక్టర్ కట్ల శ్రీనివాస్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, జిల్లా సైన్స్ రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

బీసీ ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ కమిటీ

అధ్యక్షుడిగా పొన్నం బిక్షపతి గౌడ్ ఎన్నిక



భూపాలపల్లి జోర్దార్ ప్రతినిధి:బీసీ ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడిగా పొన్నం బిక్షపతి గౌడ్ ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ ఉద్యమాన్ని పల్లెపల్లెకూ తీసుకెళ్లడంతో పాటు బీసీ సమాజంలో ఉద్యమ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

అగ్రవర్ణ ఆధిపత్యానికి తలొగ్గని, ఆత్మగౌరవంతో కూడిన బీసీ సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు, వివిధ జిల్లాల అధ్యక్షులకు, బీసీ ఉద్యమ వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ దేశగాని సాంబశివ గౌడ్కు పొన్నం బిక్షపతి గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల పరామర్శ



టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:టేకుమట్ల మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దాసరపు సదానందం తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో కోటగిరి సతీష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగీ రవి, మండల ఉపాధ్యక్షుడు మాదం కొమురయ్య, గ్రామ సర్పంచ్ పచ్చిక దిలీప్ రెడ్డి, ఉపసర్పంచ్ సల్ల వెల్లి మొండయ్య, మండల నాయకులు కోరే చందు, అమ్ము తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో
మేధావులు భాగస్వాములు కావాలి

- ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి



హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:ప్రజాస్వామ్య పరిరక్షణకు మేధావులు, ఉపాధ్యాయులు, వైద్యులు, జర్నలిస్టులు, ప్రజాస్వామ్య వాదులు భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. హసన్‌పర్తిలోని మహాలక్ష్మి బ్యాంక్వెట్ హాల్‌లో వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి మేధావుల సదస్సు 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి--మూకదాడులను నిర్మూలించండి' అనే అంశంపై జరిగిన సదస్సుకు మాజీ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎస్ఐఆర్ అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని, ఓటరు జాబితాలో పారదర్శకత తీసుకురావడమే దీని లక్ష్యమని అన్నారు. మరణించిన వారి పేర్లు, డూప్లికేట్ ఓట్లు,నివాసం మారిన వారి వివరాలను సరిచేయడమే ఈ ప్రక్రియ ఉద్దేశమని వివరించారు. ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అపోహలు సృష్టిస్తూ దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు.

అనంతరం వర్ధనపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నాలను మేధావులు తిప్పి కొట్టి వాస్తవాలను ప్రజలకు వివరించాలని కోరారు.రాష్ట్రవ్యాప్తంగా రానున్న రోజుల్లో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్,అల్లం మల్లి కార్జున రావు, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమా రస్వామి, ఆకుతోట శాంతారామ్ కర్ణ, గూడూరి లక్ష్మినారాయణ, దాసరి రాజు హరికృష్ణ తది తరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టులకు సముచిత వేతనాలు
స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలి!

- ఫార్మసిస్టుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడికి వినతి
- సానుకూలంగా స్పందించిన ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడు అరగొండ శ్రీధర్



హైదరాబాద్, జోర్దార్:తెలంగాణ రాష్ట్రంలోని ఫార్మసిస్టులకు సముచిత వేతనాలతో పాటు వారి శాశ్వత నివాస ప్రాంతాలకు సమీపంలోనే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణ గౌడ్ డిమాండ్ చేశారు. బుధ వారం తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడు అరగొండ శ్రీధర్‌ను ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూర్మ శంకర్‌తో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బత్తిని సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యను అభ్యసించి, ఫార్మసీ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ పొందిన అనేకమంది ఫార్మసిస్టులు సరైన ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ షాపుల్లో పనిచేస్తున్న ఫార్మసిస్టులకు వారి విద్యార్హతలు, వృత్తి నైపుణ్యం, బాధ్యతలకు అనుగుణంగా గౌరవప్రదమైన వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఫార్మసిస్టులు తమ కుటుంబాలకు దూరంగా వెళ్లి ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి లేకుండా, వారి శాశ్వత చిరునామాలకు సమీపంలోని మెడికల్ షాపుల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా నిరుద్యోగ ఫార్మసిస్టుల వివరాలు, మెడికల్ షాపుల్లో ఖాళీల సమాచారంతో ప్రత్యేక ఉద్యోగ పోర్టల్ ఏర్పాటు చేయాలని, ఫార్మసిస్టులకు ఉద్యోగ భద్రత, నిర్ణీత పని గంటలు, చట్టప్రకారం వర్తించే ఉద్యోగ ప్రయోజనాలు కల్పించేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని కోరారు. ఫార్మసిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన గౌరవం, ఆర్థిక భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

త్వరలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: అరగొండ శ్రీధర్

వినతిపత్రంపై తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడు అరగొండ శ్రీధర్ సానుకూలంగా స్పందించారు. ఫార్మసిస్టుల సంక్షేమ సంఘం ప్రతినిధులు తన దృష్టికి తీసుకువచ్చిన డిమాండ్లు సముచితమైనవని పేర్కొంటూ, వాటి అమలుకు త్వరలో కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఫార్మసిస్టుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన కౌన్సిల్ అధ్యక్షుడికి బత్తిని సత్యనారాయణ గౌడ్, కూర్మ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

టి ఆర్ ఎస్, రాష్ట్ర అధికార ప్రతినిధిగా
సిద్ధంశెట్టి సాజన్



బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణానికి చెందిన సింగరేణి ఉద్యోగి, సిద్ధంసెట్టి సాజన్ కు తెలంగాణ రక్షణ సేన పార్టీలో రాష్ట్రస్థాయిలో అధికార ప్రతినిధిగా స్థానం కల్పించారు.సాజన్ మందమర్రి ఏరియా హెచ్ ఎం ఎస్ యూనియన్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ గా కొనసాగుతున్నాడు.

గతంలో జాగృతి సంస్థ రాష్ట్ర స్థాయి ప్రతినిధిగా సైతం పనిచేసిన ఆయనను వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ సందర్భంగా సాజన్ మాట్లాడుతూ, నాపై నమ్మకంతో రాష్ట్ర స్థాయిలో అధికార ప్రతినిధిగా నియమించినందుకు, నమ్మకాన్ని వమ్ము చేయకుండా, తన వంతుగా టిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపారు.

శాంతిఖని గని పై
ఏ ఐ టియుసి నాయకుల ధర్నా



బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:మందమర్రి ఏరియాలోని శాంతి ఖని గని పై కార్మికుల అపరిస్మృత సమస్యలను పరిష్కరించాలని, బ్రాంచి ప్రచార కార్యదర్శి మంతెన భాస్కర్, అదనపు కార్యదర్శి తిరుపతి గౌడ్,ల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి గని మేనేజర్ కు వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతినెల మెడికల్ బోర్డు నిర్వహించి ఏ ఏరియా వారికి ఆ ఏరియా ఆసుపత్రుల్లోనే మెడికల్ ఇన్వాల్యుడేషన్ చేయాలని, తెలంగాణ విద్యుత్ శాఖ జెన్కో ట్రాన్స్కో సంస్థల నుండి సింగరేణి సంస్థకు రావలసిన 59 వేల కోట్ల డబ్బులను వెంటనే చెల్లించాలని, కార్మికులకు పని స్థలాల్లో పనిముట్లను లోటు లేకుండా అందించాలని, పెరుక్స్ పై ఇన్కమ్ టాక్స్ రద్దు చేసేందుకు సర్కులర్లు జారీ చేయాలని, సొంత ఇంటి పథకాన్ని త్వరగా అమలు జరపాలని, డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్, ఆమ్జాత్ ఖాన్, రాజేశం, బుచ్చయ్య, తదితర మైన్, సేఫ్టీ, క్యాంటీన్ సభ్యులు, కార్మికులు, హాజరయ్యారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని కారు ధ్వంసం
కుటుంబానికి తప్పిన ప్రమాదం

హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లాపూర్ గ్రామ శివారులో మంగళవారం ఘోరోద్దు ప్రమాదం చోటుచేసుకుంది. ఎల్కతుర్తి నుండి హనుమ కొండ వైపు ప్రయాణిస్తున్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది.

తొర్రూర్‌కు చెందిన తుర్పటి రావు కుటుంబ సభ్యులతో కలిసి కారులో ఎల్లాపూర్‌లోని మాంటిసోరి పాఠశాలకు వెళ్లి తిరిగి వస్తుండగా,మధ్యాహ్న సమయంలో కరీంనగర్ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి కారును ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న కుటుంబ సభ్యులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

బాధితుడు ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ కొత్తపల్లి అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు ఇన్స్పెక్టర్ ఆకునూరి మహేందర్ తెలిపారు.

వృత్తి విద్య ఉపాధ్యాయుల ఆందోళన బాట
విద్యాశాఖ డైరెక్టరేట్ ముట్టడి

- సమాన పనికి సమాన వేతనం
- 12 నెలల జీతం
- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్



హనుమ కొండ,జోర్దార్ ప్రతినిధి:తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న వృత్తి విద్య ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట పట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బుధవారం హైదరాబాద్ లోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు.సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఏడాదిలో 12 నెలల పాటు జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధ్యాయులు ప్రధానంగా డిమాండ్ చేశారు. చాలా కాలంగా అవుట్ సోర్సింగ్ విధానంలో సేవలందిస్తు న్నప్పటికీ తమకు ఉద్యోగ భద్రత, ఆర్థిక భరోసా లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు.

ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి, పెండింగ్ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయులు కోరారు.

తమ హక్కులు సాధించే వరకు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

తాత్కాలిక భవనంలోనే వైద్య కళాశాల

- విద్యార్థుల అవస్థలు!
- నాలుగేళ్లయినా నెరవేరని శాశ్వత భవనం హామీ..
- వసతి, మరుగుదొడ్లు, రవాణా సౌకర్యాలు కరువు
- ఒకే గదిలో 16--17 మంది బాలికలు..
- రెండు ఉపన్యాస మందిరాలతో నాలుగు బ్యాచ్‌లకు బోధనరెండు నెలలుగా నిలిచిన భోజనశాల..
- ప్రిన్సిపాల్‌కు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదని విద్యార్థుల ఆవేదన

(జోర్దార్ ప్రత్యేక ప్రతినిధి)ప్రభుత్వ వైద్య విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో కళాశాలలో చేరిన విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కూడా కరువయ్యాయి. కళాశాల ప్రారంభమై నాలుగేళ్లు గడుస్తున్నా తాత్కాలిక భవనంలోనే తరగతులు కొనసాగుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వసతి గృహాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, రవాణా, భోజన సౌకర్యాలు ఇలా ప్రతి విషయంలోనూ సమస్యలు వెంటాడుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడు నెలల హామీ.. నాలుగేళ్లయినా మార్పు లేదు!

2023లో ప్రారంభమైన జి.ఎం.సి. వి.కె.బి. కళాశాలను మొదట తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేశారు.

నిధుల కొరత కారణంగా తాత్కాలిక భవనంలోనే కొనసాగిస్తూ మూడు నెలల్లో శాశ్వత భవనంలోకి మారుస్తామని అప్పట్లో హామీ ఇచ్చినట్లు విద్యార్థులు చెబుతున్నారు. అయితే నాలుగేళ్లు గడిచినా ఆ హామీ కార్యరూపం దాల్చలేదని వాపోతున్నారు. కళాశాలకు సొంత వసతి గృహం లేకపోవడంతో బాలికలు కేంద్ర ప్రభుత్వ ఆయుష్ ఆసుపత్రి భవనంలో ఉంటున్నారు. ఒకే వార్డు గదిలో 16 నుంచి 17 మంది వరకు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు.

నాలుగు బ్యాచ్‌ల విద్యార్థులకు సరిపడా ఉపన్యాస మందిరాలు కేవలం రెండే ఉండటంతో తరగతుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కళాశాల ప్రాంగణంలో కనీసం మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రవాణా,భోజన సౌకర్యాలూ కరువే!

వైద్య విద్యలో భాగంగా వివిధ ఆసుపత్రులకు పోస్టింగ్‌లకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ కళాశాల నుంచి రవాణా సౌకర్యం కల్పించడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. సుమారు 300 మంది విద్యార్థులు టీఎస్ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడుతున్నారని, అయితే బస్సులు కళాశాల వద్ద అరుదుగా మాత్రమే ఆగుతున్నాయని తెలిపారు.

మరోవైపు గత రెండు నెలలుగా భోజనశాల సౌకర్యం నిలిచిపోయింది.

భోజన నాణ్యత సరిగా లేకపోవడంతో నిలిచిపోయిన ఈ సౌకర్యాన్ని పునరుద్ధరించేందుకు కొత్త గుత్తేదారును నియమించే చర్యలు చేపట్టడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. దీంతో బయట నుంచి ఆహారం తెచ్చుకోవడం లేదా వసతి గృహాల్లోనే వండుకోవడం తప్పడం లేదని వాపోతున్నారు.

ఈ క్రమంలో గదుల్లోని ప్లగ్ పాయింట్లను తొలగించాలని ప్రిన్సిపాల్ ఆదేశించినట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు.

ప్రిన్సిపాల్‌కు విన్నవించినా ఫలితం శూన్యం!

కళాశాలలో ఎదురవుతున్న సమస్యలను ప్రిన్సిపాల్ డాక్టర్ దీన్ దయాళ్ బంగ్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా స్పందన లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు కనీస వసతులు కల్పించకపోవడం వారి విద్యాభ్యాసం, ఆరోగ్యం, భద్రతపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇప్పటికైనా వైద్య విద్యాశాఖ ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు స్పందించి కళాశాలకు శాశ్వత భవనం, ప్రత్యేక వసతి గృహాలు, మరుగుదొడ్లు, రవాణా, నాణ్యమైన భోజన సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సస్పెండ్ చేసినా
తెరుచుకుంటున్న మెడికల్ షాపులు!

- ఔషధ నియంత్రణ అధికారులపై యజమానుల ఒత్తిళ్లు?

(హైదరాబాద్: జోర్దార్ ప్రతినిధి)రాష్ట్రంలో అలవాటు కలిగించే మత్తు మందుల అక్రమ విక్రయాలు, మళ్లింపులను అరికట్టేందుకు తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (ఏ+ గూఖీజు) చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో భారీ సంఖ్యలో మెడికల్ షాపులపై చర్యలు తీసుకున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ చర్యల అమలుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారికంగా సస్పెన్షన్‌కు గురైన కొన్ని మెడికల్ షాపుల యజమానులు తిరిగి వ్యాపారాలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి.

TG SAFE కమిషనర్ ఈ నెల 3వ తేదీన విడుదల చేసిన ప్రెస్‌నోట్ ప్రకారం.. అక్టోబర్ 15న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 138 మెడికల్ షాపులపై సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. వీటిలో 98 షాపులపై తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సస్పెన్షన్ విధించగా, మరో 40 షాపులకు నిర్దిష్ట కాలపరిమితితో సస్పెన్షన్ విధించారు. అదనంగా రెండు సంస్థలకు హెచ్చరికలు జారీ చేశారు. మొత్తంగా 140 చర్యలు తీసుకున్నట్లు TG SAFE ప్రకటించింది.

అయితే ఇంతటి కఠిన చర్యలు తీసుకున్నప్పటికీ, కొందరు సస్పెండైన మెడికల్ షాపుల యజమానులు తమ పలుకుబడిని ఉపయోగించి ఔషధ నియంత్రణ శాఖ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు ఫోన్లు చేయిస్తూ, తమ మెడికల్ షాపులను అనధికారికంగా తిరిగి తెరిచినా చూసీచూడనట్లు వ్యవహరించాలని కోరుతున్నారనే ఫిర్యాదులు వెలువడుతున్నాయి.

ప్రభుత్వం ఒకవైపు మత్తు మందుల అక్రమ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశాలు జారీ చేస్తుంటే, మరోవైపు సస్పెన్షన్ ఉత్తర్వుల అమలులో ఇలాంటి ఒత్తిళ్లు ఎదురవుతున్నాయనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిజంగా సస్పెన్షన్‌కు గురైన షాపులు మూసివేశారా? ఏవైనా షాపులు ఉత్తర్వులను ఉల్లంఘించి వ్యాపారాలు కొనసాగిస్తున్నాయా? అధికారులపై ఒత్తిళ్లు వస్తున్నాయనే ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.మత్తు మందుల అక్రమ విక్రయాలను అరికట్టాలంటే కేవలం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయ డమే కాకుండా, వాటి అమలుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ప్రజలు కోరుతున్నారు. సస్పెండైన మెడికల్ షాపులు నిబంధనలకు విరుద్ధంగా తిరిగి తెరుచుకుంటే సంబంధిత యజమానులతో పాటు, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపైనా విచారణ జరిపి చర్యలు తీసు కోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఇప్పటికైనా TG SAFE ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, సస్పెన్షన్ ఉత్తర్వులు పక్కాగా అమలవుతున్నాయో లేదో తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

మృతురాలు దాసరి భాగ్య కుటుంబానికి
మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శ



ముత్తారం,జోర్దార్ ప్రతినిధి:ముత్తారం మండలం ఓడెడ్ గ్రామంలో మంథని మాజీ ఎమ్మెల్యే దాసరి భాగ్య ఇటీవల మృతి చెందగా,

ఆమె కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఉపసర్పంచ్ దేవునూరి భానుకుమార్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

అలాగే ముత్తారం మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీనియర్ రిపోర్టర్ ఎలువాక కుమార్‌ను కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు నూనె కుమార్,

గ్రామ శాఖ అధ్యక్షుడు అలవోజు రవీందర్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసి ఉత్సవాలను అంతరించిపోకుండా
ముందు తరాలకు అందించాలి



- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య.

బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:ఆదివాసి గూడాల్లో ఎంతో నియమ నిష్టలతో జరుపుకునే పండుగలను అంతరించిపోకుండా కాపాడుకోవాలని, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు.

బుధవారం కాసిపేట మండలంలోని దేవాపూర్ సల్పల వాగు ప్రాంతంలో నిర్వహించిన సంప్రదాయబద్ధమైన దండారి దర్బార్ ఉత్సవాల్లో ఆదివాసీలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివాసీలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఆదివాసీ సంప్రదాయాలు, సంస్కృతి,కళా వైభవాన్ని ఆగిపోకుండా,

అంతరించిపోకుండా, ముందు తరాలకు అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసి ప్రతినిధులు, కాసిపేట మండల అధ్యక్షులు రమణారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లల కోసం వచ్చిన సొమ్ము పెద్దల పాట్లలోకి!

- **ప్రభుత్వ నిబంధనలే దోపిడీకి దారి - బడి నిధులు ఎవరి పాలు?**
- **విరమణ తర్వాత కూడా తీరని దాహం - ఇంట్లోనే రెండు కోట్ల వ్యాపారం!**

(కరీంనగర్ జోర్దార్)

1. చిన్న గాయానికి మందు వేయబోయి పెద్ద గాయం చేసినట్లు

చిన్న మొత్తంలో వచ్చే సొమ్మును సక్రమంగా వాడాలనే పేరుతో తెచ్చిన కొత్త నిబంధనలు ఉపాధ్యాయులకు పెద్ద తలనొప్పిగా మారాయి. పాత పద్ధతి స్థానంలో వచ్చిన ఈ కొత్త చెల్లింపు విధానం వల్ల పని సులభం కావాల్సింది పోయి మరింత కష్టమైంది.

2. కాగితాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి

ఇప్పుడు సొమ్ము వాడే ముందే చెల్లింపు చేసినట్లు పత్రాలు చూపించాలి, సమావేశ నిర్ణయం రాయాలి, దానిని సముదాయ పెద్ద ఉపాధ్యాయుడి నుండి అనుమతి తెచ్చుకోవాలి. ఇలాంటి అవసరం లేని నియమాల వల్ల ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఏం చేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ఉన్న పాఠశాలలో ఆ ఉపాధ్యాయుడు పాఠాలు వదిలి నాలుగు రోజులు ఈ పత్రాల కోసం తిరగాల్సి వస్తోంది.

3. సొంత జేబు నుంచి పెట్టాలా? పత్రం కోసం బతిమాలాలా?

ఉపాధ్యాయుడు ముందు తన సొంత డబ్బు పెట్టి వస్తువులు కొనాలి. లేదా ఎవరో ఒక వ్యాపారి దగ్గర ముందుగా మాట్లాడి చెల్లింపు జరిగినట్లు పత్రం తెచ్చుకోవాలి. ఆ పత్రం ఖజానా దగ్గర ఆమోదం పొంది డబ్బు వచ్చే వరకు ఎంతకాలం పడుతుందో ఎవరూ చెప్పలేరు. డబ్బు వచ్చాక వస్తువులు తెచ్చి మళ్ళీ పత్రాలు, నిల్వ వివరాలు ఇవ్వాలి. సొంత డబ్బు పెడితే అది తిరిగి ఎప్పుడు వస్తుందో తెలియదు.

4. వస్తువు లేకుండానే పత్రం - వాటా పేరుతో దోపిడీ

వస్తువు ఇవ్వకుండానే కేవలం పత్రం ఇచ్చే వారు ఎంత వాటా తీసుకుంటారో వారికే తెలుసు. ఈ విధానంలో పత్రాలు చేయించిన ఉపాధ్యాయులు చెప్పిన దాని ప్రకారం కనీసం పది శాతం వాటా కింద పోతోంది. అసలే తక్కువగా వచ్చే సొమ్ములో ఇలా కోత పడితే బడికి మిగిలేదేమిటి? ప్రభుత్వం ఇచ్చే సొమ్ము చిల్లు పడిన కుండలో పోసిన నీటిలా వృథా అవుతోందని ఉపాధ్యాయ వర్గం ఆవేదన వ్యక్తం చేస్తోంది. పావు వంతు వరకు ఇలా వాటాలకే పోతోందని వారు వాపోతున్నారు.

5. విరమణ పొందిన పెద్దాయన ఇంట్లోనే వ్యాపార కేంద్రం

ఈ పరిస్థితినే అవకాశంగా మార్చుకుని విరమణ పొందిన ఒక పెద్ద ఉపాధ్యాయుడు రెండు ప్రస్తుత ఖాతాలు తెరిచినట్లు తెలిసింది. అడిగిన వారికి అడిగినట్లు పది శాతం వాటాకు పత్రాలు ఇస్తున్నాడని, కావలసిన సామగ్రిని ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నాడని సమాచారం. ఆయన బయట కొని తెస్తే అందులో కూడా మరో వాటా పోతుందని చెప్పక తప్పదు.

6. సముదాయ పెద్దల దగ్గర కూడా అదే తీరు

ఒక్కో సముదాయంలోని పెద్దలు వంద రకాల అడ్డంకులు సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు అయితే అన్నీ మేమే చూసుకుంటాం, ఆ వాటా మేమే తీసుకుంటాం అని బహిరంగంగానే చెబుతున్నారట.

7. ప్రభుత్వమే సామగ్రి ఇస్తే ఈ బాధ ఎందుకు?

బడికి ఏం కావాలో ప్రభుత్వమే నేరుగా పంపితే సరిపోయేదానికి ఉపాధ్యాయులకు ఈ కఠిన పరీక్షలు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. పైగా ఇంత తేడీలోపల ఖర్చు చేయాలని ఆదేశిస్తున్నారు. తెల్లటి పొడి, నకలు తీయడం, చేతులు కడుక్కునే ద్రవం, చీపుర్లు, శుభ్రపరిచే ద్రవం, జెండా వందనం మిఠాయిలు, చిన్న మొక్కలు వంటివి కొనడానికి సొమ్ము ఎక్కడి నుంచి తేవాలి? కూలి పని జరిగితే చెల్లింపు పత్రం ఎవరు ఇస్తారు? అన్నీ ఒకేసారి ఖర్చు పెడితే జనవరిలో వచ్చే ఖర్చును ఎలా చూసుకోవాలి? అన్న అనుమానాలతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు.

8. పెద్ద హోదా పొందిన వారి మౌనం - సంఘాల పెద్దల పట్టనట్టు వ్యవహారం

ఇంత జరుగుతున్నా పెద్ద హోదా వచ్చిందన్న ఆనందంలో ఉన్న ప్రధానోపాధ్యాయులు ఏమాత్రం వ్యతిరేకత చూపకుండా, నోరు మెదపకుండా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఉపాధ్యాయుల కోసం ఏదాది పొడవునా విధి నిర్వహణ సెలవు తీసుకునే సంఘాల పెద్దలు ఈ అంశంలో పట్టనట్టు ఉండడం మరింత వింతగా అనిపిస్తోంది.

9. జీతాల పత్రాలు కూడా నిలిచిపోయాయి

ప్రాథమిక పూర్వ పేరుతో వచ్చిన నాలుగు నెలల ఉపాధ్యాయుడు, ఆయా జీతాల పత్రాలను మండల విద్యాధికారులు ఇచ్చి పదిహేను రోజులు అయినా ఇంకా కుబేర్ లో నిలిచి ఉన్నాయి. దీనికి తోడు పాఠశాల నిధులను కొత్త విధానానికి ముడిపెట్టడం మరింత ఇబ్బందిగా మారింది. సంఘాల ప్రతినిధులు వెంటనే స్పందించాలని ఉపాధ్యాయ లోకం కోరుకుంటోంది.

10. నిఘా విభాగం విచారించాలి - దుకాణదారుల సంఘం విన్నపం

కరీంనగర్ లో విరమణ పొందిన అధికార హోదా కలిగిన ప్రధానోపాధ్యాయుడు చేస్తున్న వ్యాపారంపై నిఘా విభాగం వెంటనే విచారణ చేయాలని, ఆయన ఇంటిపై తనిఖీ చేయాలని, ఎలాంటి అనుమతి లేకుండా సామగ్రి ఎలా అమ్ముతారని దుకాణదారుల సంఘం ఫిర్యాదు చేసింది. ఇంట్లో అమ్మే సామగ్రికి ప్రస్తుత ఖాతా ఇవ్వడం, పన్ను లేకుండా దుకాణం నడపడం నియమాలకు విరుద్ధమని, కేవలం వాటా కోసం ఒక ఉపాధ్యాయుడు వ్యాపారం చేయడం సిగ్గుచేటని వారు భావిస్తున్నారు.

ఇప్పటికే సుమారు రెండు కోట్ల వ్యాపార మొత్తం జరిగినట్లు, అందులో పది శాతం అంటే ఇరవై లక్షల రూపాయలు ఒక విరమణ పొందిన ఉద్యోగి ఇంట్లో కూర్చొని సంపాదించడం పూర్తిగా నియమాలకు వ్యతిరేకమని, ఆయన ఇచ్చిన పత్రాలను వెంటనే రద్దు చేయాలని, కొత్త విధానాన్ని రద్దు చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

ఉపాధ్యాయుల మీద నమ్మకం లేకపోతే కావలసిన సామగ్రి జాబితాను పాఠశాలల నుంచి తీసుకుని ప్రభుత్వమే నేరుగా పంపాలని వారు కోరుతున్నారు.

కార్పొరేషన్ వేదికగా
లీసైక్లింగ్ మాఫియా రాజకీయం

- **నిబంధనలు గాల్లోకి.. సంతకాలు లేకుండానే 200 ఏసీకేల బియ్యం మళ్లింపు**
- **సస్పెండెడ్ అధికారి రాఘవేందర్ రావు వెనుక పెద్ద తిమింగలం ఎవరు?**

(జోర్దార్ ప్రతినిధి భూపాలపల్లి /హైదారాబాద్)పేదల కడుపు నింపాల్సిన బియ్యం.. అవినీతి అధికారుల జేబులు నింపుతోంది. తెలంగాణ సివిల్ సప్లై కార్పొరేషన్‌లో ఏళ్లుగా సాగుతున్న భారీ కుంభకోణాల పుట్ట ఒక్కొక్కటిగా పగులుతోంది. గతంలో భూపాలపల్లి జిల్లా డీఎంగా పనిచేసిన సమయములో ప్రస్తుతం కార్పొరేషన్‌లో ఉన్న రాఘవేందర్ రావు అవినీతి సామ్రాజ్యం తవ్వేకొద్దీ దిగ్భ్రాంతికర నిజాలను బయటపెడుతోంది.

2021-2022 సంస్సరములో ?కరీంనగర్ జిల్లా రీసైక్లింగ్ మాఫియా 'కింగ్ పిన్' గా పిలువబడే అతనితో చేతులు కలిపిన ఈ అధికారి, అప్పట్లో కరీంనగర్‌లో అడిషనల్ కలెక్టర్‌గా చేసి ప్రస్తుతం డైరెక్టర్ స్థాయిలో ఉన్న మరో బడా అధికారితో కలిసి సాగించిన ఈ కోట్ల బియ్యం దందా ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది.

మాఫియా కోసమే 'స్పెషల్ కోటా'.. రికార్డుల్లో అడ్డగోలు గోల్‌మాల్

కరీంనగర్ జిల్లాలోని చిన్న తరహా రైస్ మిల్లర్ల హక్కులను కాలరాస్తూ, బియ్యం సేకరణలో ఎఫ్‌సీఐ , రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలను అటకెక్కించారు. ఒకే ఒక్క వ్యక్తికి లబ్ధి చేకూర్చేందుకు సదరు మాఫియా నేతకు చెందిన 4 రైస్ మిల్లుల పేరిట ఎలాంటి అధికారిక ఉత్తర్వులు (Orders), ఉన్నతాధికారుల సంతకాలు లేవు. అయినప్పటికీ.. భూపాలపల్లి గోదాన్ల కు కరీంనగర్ జిల్లా నుంచి ఏకంగా 200 ఏసీకేల బియ్యాన్ని ఒకే ఒక వ్యక్తికి స్టేట్ ఫుల్ కింద దారి మళ్లించారు. ఈ అక్రమ రవాణాను కప్పిపుచ్చేందుకు ఒకే రోజు 100 ఏసీకేల చొప్పున ఇచ్చినట్లు రికార్డుల్లో తప్పుడు కాగితాలు సృష్టించి అడ్డంగా దొరికిపోయారు.

రోడ్డున పడ్డ చిన్న మిల్లర్లు.. వెనక ఉన్న ఆ 'డైరెక్టర్' ఎవరు?

ఈ అధికారుల ధన దాహానికి కరీంనగర్ జిల్లాలోని చాలమంది మిల్లర్లు నిజాయితీగల –రైస్ మిల్లర్లు తీవ్రంగా నష్టపోయి, అప్పుల పాలై డిఫాల్టర్లుగా మారిపోయారు.

ఎందుకంటే మిల్లర్ల అందరికి దించుకొన్నా ధాన్యం పర్సంటేజి ప్రకారం మిగిత మిల్లర్స్ కు కెటియించకుండ ఒక వ్యక్తికి స్టేట్ కొట క్రింద కరీంనగర్ బియ్యాన్ని భూపాలపల్లికి జిల్లాకు మళ్లించి రీసైక్లింగ్ బియ్యాన్ని కోట్లు నొక్కేసిన ఈ ముఠాలో ప్రతి అధికారి వాటా ఎంత అనే ప్రశ్నలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి.

సీఐడీ విచారణే శరణ్యం!

ప్రస్తుతం సస్పెన్షన్ వేటు ఎదుర్కొంటున్న రాఘవేందర్ రావును సీఐడీ కస్టడీలోకి తీసుకుని విచారిస్తేనే ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు నిజాలు 'సివిల్ సప్లైస్ డైరెక్టర్' ముసుగు వీడుతుంది. కరీంనగర్ నుంచి భూపాలపల్లికి బియ్యం ఎలా తరలాయి?

రీసైక్లింగ్ మాఫియా డాన్‌కు, ఈ అధికారులకు ఉన్న ఆర్థిక బంధమేమిటి? అన్న కోణంలో లోతైన విచారణ తనిఖీలు జరగాల్సి ఉంది.

దొంగ మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిందే!

వ్యవస్థను గుల్ల చేస్తున్న ఇలాంటి అవినీతి తిమింగలాలను, రీసైక్లింగ్ మాఫియా డాన్లను వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాలని..

కార్పొరేషన్‌ను ప్రక్షాళన చేయాలని నిజాయితి గలరైస్ మిల్లర్లలు పలు ప్రజసంఘాలు, ప్రభుత్వాన్ని గట్టిగా డిమా ండ్ చేస్తున్నారు.

ఎస్ఐఆర్ పై ఆందోళనలు అవసరం లేదు

- **ప్రజ్ఞా భారతి సదస్సులో ప్రముఖ పాత్రికేయులు సురేష్ కొచ్చెట్టిల్.**



దేశవ్యాప్తంగా నిర్వహించే ఎస్ఐఆర్ ప్రక్రియ, దాని వెనుక ఉన్న రాజ్యాంగబద్ధమైన అవసరాలు, మరియు ఓటర్ల జాబితా ఆధారిత తొలగింపులపై సాగుతున్న ప్రచారాలపై ప్రజలలో ఆందోళన అవసరం లేదని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, సీనియర్ పాత్రికేయులు సురేష్ కొచ్చట్టిల్ స్పష్టత ఇచ్చారు.

ప్రజ్ఞ భారతి వరంగల్ శాఖ ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ పై హనుమకొండలోని అంబేద్కర్ భవన్లో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. ప్రజ్ఞా భారతి వరంగల్ శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ రామ్ గోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు చట్టబద్ధంగా తీసుకునే ప్రమాణ స్వీకారానికి మరియు ఎస్ఐఆర్ ప్రక్రియ అమలుకు ఉన్న సంబంధాన్ని వివరిస్తూ, ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి నిబంధనల ప్రకారం ఇది తప్పనిసరి అని స్పష్టం చేశారు.

ప్రజాప్రతినిధులు (ఎంపీ, ఎమ్మెల్యే లేదా మంత్రులు) పదవీ బాధ్యతలు చేపట్టే ముందు "చట్టం ద్వారా ఏర్పాటు చేయబడిన రాజ్యాంగాన్ని రక్షించి, కాపాడతాను" అని ప్రమాణ స్వీకారం చేస్తారని గుర్తుచేశారు. అందువల్ల రాజ్యాంగబద్ధమైన ఎస్ఐఆర్ ప్రక్రియను కాపాడవలసిన బాధ్యత ప్రజాప్రతినిధులందరిపై ఉందని తెలిపారు.

ఎస్ఐఆర్ చరిత్ర మరియు గత అనుభవాలు

ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ కొత్తదేమీ కాదని, గతంలో 8 సార్లు నిర్వహించబడిందని వివరించారు.

ఇందులో 6 సార్లు కాంగ్రెస్ పార్టీ హయాంలోనే (జవహర్‌లాల్ నెహ్రూ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ కాలంలో) జరిగాయని తెలిపారు.

వాజ్‌పేయి హయాంలో కూడా ఒకసారి ఈ ప్రక్రియ పూర్తయ్యిందని చెప్పారు.

2001-2002 నాటి ఎస్ఐఆర్ తర్వాత దాదాపు 24 సంవత్సరాలుగా పూర్తిస్థాయి సవరణ జరగలేదని ప్రస్తావించారు.

ఎస్ఐఆర్ సమగ్ర పరిశీలన సమయంలో జాబితా నుండి పేర్లను తొలగించడానికి ప్రధానంగా 4 కారణాలు ఉంటాయని స్పష్టం చేశారు. దానిలో మొదటిది బిఎల్ఓలు (బూత్ లెవల్ అధికారులు) ఇళ్లకు వెళ్లినప్పుడు ఓటర్లు అందుబాటులో లేకపోవడం. రెండవది

మృతి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడం. మూడవది

ఉపాధి లేదా ఇతర కారణాల వల్ల వేరే నగరాలకు/రాష్ట్రాలకు శాశ్వతంగా వలస వెళ్లిపోవడం. నాలుగవది

ఒకే వ్యక్తి పేరు సాంకేతిక లోపాలు లేదా చిరునామా మార్పుల వల్ల రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల నమోదై ఉండటం.

హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి వంటి అతిపెద్ద లోక్‌సభ నియోజకవర్గంలో దాదాపు 38 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, పెబల్ సిటీ వంటి పెద్ద అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లలో బిఎల్ఓలు స్వయంగా ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించడం లాజిస్టికల్‌గా ఎంతో కష్టతరమైన పనని వివరించారు

బీహార్‌లో తొలిదశ ఎస్ఐఆర్ సందర్భంగా 67 లక్షల ఓటర్ల పేర్లను తొలగించినప్పుడు ప్రతిపక్షాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయని, అయితే క్షేత్రస్థాయిలో రీ-అప్లై లేదా డిలీషన్ సవరణలకు అవకాశం ఇచ్చినా నమోదులు అత్యల్పంగానే నమోదయ్యాయని ప్రస్తావించారు.

పశ్చిమ బెంగాల్‌లో 1971 బంగ్లాదేశ్ యుద్ధం నాటి నుండి భారీగా చొరబాట్లు జరగడం, నకిలీ పదవ తరగతి సర్టిఫికేట్లు/రేషన్ కార్డులతో ఓటరు గుర్తింపు సాధించడం వంటి అంశాలు ఎస్ఐఆర్ మ్యాపింగ్‌లో స్పష్టంగా బయటపడ్డాయని విశ్లేషించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ ఓటు హక్కును కాలరాయడానికి కాదని, ఓటర్ల జాబితాలో ఉండే అక్రమాలను, బోగస్ ఓట్లను ఏరివేసి ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన చట్టబద్ధమైన ప్రక్రియ మాత్రమేనని వివరించారు.

ఈ కార్యక్రమంలో ప్రజ్ఞాభారతి రాష్ట్ర సహాయ కార్యదర్శి, ప్రముఖ అడ్వకేట్ చామర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

నాటుసారాయి, అక్రమ మద్యం
విక్రయాలపై ఉక్కుపాదం!

- **ఐదు లీటర్ల నాటుసారాయి స్వాధీనం.. ముగ్గురిపై కేసులు నమోదు**

(వీణవంక జోర్దార్ ప్రతినిధి)వీణవంక మండలంలో నాటుసారాయి తయారీ, అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. బుధవారం జమ్మికుంట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వీణవంక మండలంలో జిల్లా టాస్క్ ఫోర్స్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కరీంనగర్ బృందం ఆకస్మిక దాడులు నిర్వహించింది.

ఈ దాడుల్లో చల్లూరు గ్రామానికి చెందిన బోడస్ సంపత్ (తండ్రి మల్లయ్య) వద్ద ఐదు లీటర్ల నాటుసారాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే కనపర్తి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బోయిని రాజు (తండ్రి సారయ్య), చిందం రాములు (తండ్రి రామస్వామి)లపై కేసులు నమోదు చేసినట్లు కరీంనగర్

ఎక్సైజ్ జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ జి. దుర్గాభవాని తెలిపారు.

అక్రమ మద్యం విక్రయాలు, నాటుసారాయి తయారీపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది రాజు, రాజేందర్, సతీష్, అక్షర పాల్గొన్నారు.

సబ్సిడీ పత్తి రకం రాశి స్విఫ్ట్‌తో అధిక దిగుబడికి అవకాశం

- **కేంద్ర ప్రభుత్వ పథకం కింద వంద శాతం రాయితీతో విత్తనాల పంపిణీ**
- **తెల్లదోమ, పచ్చదోమలను తట్టుకునే ప్రత్యేక లక్షణాలు**

(జమ్మికుంట జోర్దార్ ప్రతినిధి) రైతులకు అధిక దిగుబడులు అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కపాస్ క్రాంతి పథకం కింద రాశి స్విఫ్ట్ పత్తి విత్తనాలను వంద శాతం రాయితీతో అందిస్తున్నారు. ఈ రకం పత్తి సాగుతో నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉందని వ్యవసాయ, కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా బుధవారం తనుగుల గ్రామంలో పత్తి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తనుగుల వ్యవసాయ విస్తరణ అధికారి అచ్యుత్ మాట్లాడుతూ.. రాశి స్విఫ్ట్ రకం అన్ని రకాల నేలలకు అనుకూలంగా ఉండటంతో పాటు ముందస్తుగా పంట చేతికి వస్తుందని తెలిపారు. తెల్లదోమ, పచ్చదోమలను సమర్థవంతంగా తట్టుకునే లక్షణాలు ఈ రకానికి ఉన్నాయని వివరించారు. ఆకు పరిమాణం చిన్నగా ఉండటంతో అధిక వర్షాలు కురిసినప్పుడు కాయ కుళ్లే సమస్య తగ్గే అవకాశం ఉందన్నారు. ముందస్తు పంట కావడంతో నవంబరులో ఆశించే గులాబీ రంగు పురుగు ఉధృతి నుంచి పంటను కొంత వరకు తప్పించుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాశి కంపెనీ కరీంనగర్ ప్రాంతీయ అధికారి రమణారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం రాశి స్విఫ్ట్ రకానికి ఉందని తెలిపారు. ఇతర రకాలతో పోలిస్తే ముందస్తుగా పంట చేతికి రావడం, నాణ్యమైన పత్తి దిగుబడి సాధించే అవకాశం ఉండటం దీని ప్రత్యేకతలని వివరించారు. రైతులు ఈ రకాన్ని సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన



- **పంటల యాజమాన్యం, చీడపీడల నివారణపై క్షేత్రస్థాయి సమావేశం**

(ఇల్లందకుంట జోర్దార్ ప్రతినిధి)రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటు పంటల దిగుబడుల పెంపునకు తోడ్పడే లక్ష్యంతో ఇన్సెక్టిసైడ్స్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన ట్రాక్టర్ బ్రాండ్ ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం సీతంపేట గ్రామంలో క్షేత్రస్థాయి రైతు సమావేశం నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు బురుగు కుమారస్వామి వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఈ సమావేశానికి రైతులు ఉత్సాహంగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, పంటల యాజమాన్యం, చీడపీడల నివారణ చర్యలు, కంపెనీ ఉత్పత్తుల వినియోగంపై అవగాహన కల్పించారు. పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెరుగైన వ్యవసాయ పద్ధతులను వివరించారు.ఈ కార్యక్రమంలో ఎం.ఎం. రవీందర్ రావు, ఎఫ్.ఎం.ఎం. విజయ్ భాస్కర్, ఎఫ్.ఎం.ఈ. అజయ్ పటేల్, అమ్మకాల కార్యనిర్వాహకుడు రవీందర్ రెడ్డితో పాటు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.రైతులకు నూతన వ్యవసాయ పరిజ్ఞానాన్ని చేరవేయడం, పంటల అభివృద్ధికి దోహదపడటం, రైతులతో సంస్థ సంబంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

అవినీతిని ఉపేక్షించం..

నిరాధార ఆరోపణలు సహించం!

- నిమ్స్‌లో అక్రమాలపై పారదర్శక విచారణ జరపాలి
- తప్పు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.. మొత్తం అధ్యాపక వర్గానికి ఆరోపణలను ఆపాదించొద్దు
- నిమ్స్ ఫ్యాకల్టీ అసోసియేషన్ స్పష్టీకరణ

(హైదరాబాద్ జోర్దార్ ప్రత్యేక ప్రతినిధి) హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో అవినీతి, అక్రమాలు జరిగినట్లు ఇటీవల వివిధ పత్రికలు, టెలివిజన్ ఛానళ్లు, డిజిటల్ మీడియా వేదికల్లో వస్తున్న కథనాలపై నిమ్స్ ఫ్యాకల్టీ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అవినీతి, ఆర్థిక అక్రమాలు, వృత్తిపరమైన అవకతవకలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, అయితే ధ్రువీకరించని ఆరోపణలను వాస్తవాలుగా ప్రచారం చేస్తూ మొత్తం అధ్యాపక వర్గం ప్రతిష్ఠను దెబ్బతీయడం సమంజసం కాదని స్పష్టం చేసింది.

ఆధారాలతో విచారణ జరపాలి

కొన్ని మీడియా కథనాల్లో నిర్ధారణ కాని సమాచారం, వదంతులు, ఊహాగానాలను వాస్తవాలుగా చిత్రీకరిస్తున్నారని అసోసియేషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. సరైన ఆధారాలు, అధికారిక నిర్ధారణ లేకుండా ఇలాంటి వార్తలు ప్రచారం చేయడం వల్ల నిమ్స్ సంస్థ ప్రతిష్ఠతో పాటు అంకితభావంతో పనిచేస్తున్న అధ్యాపకులు, వైద్య నిపుణుల వృత్తిపరమైన గౌరవం దెబ్బతింటుందని పేర్కొంది.

వ్యక్తిగతంగా కొందరిపై వచ్చిన ఆరోపణలను మొత్తం అధ్యాపక వర్గానికి ఆపాదించడం సరికాదని తెలిపింది. నిర్దిష్ట వ్యక్తులపై వచ్చిన ఆరోపణలను ఆధారాలు, వాస్తవాల ప్రాతిపదికన వ్యక్తిగతంగా పరిశీలించి విచారణ జరపాలని కోరింది. విచారణ పూర్తికాకముందే ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా ప్రచారం చేయవద్దని సూచించింది.

తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నిమ్స్ అనేక దశాబ్దాలుగా వైద్య విద్య, పరిశోధన, రోగుల చికిత్స, అత్యున్నత వైద్య సేవల్లో విశేష గుర్తింపు పొందిందని అసోసియేషన్ గుర్తుచేసింది. ముఖ్యంగా పేద, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన రోగులకు నిమ్స్ వైద్యులు, అధ్యాపకులు అంకితభావంతో సేవలందిస్తున్నారని పేర్కొంది.

అవినీతి, ఆర్థిక అక్రమాలు, వృత్తిపరమైన అవకతవకలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

అదే సమయంలో నిరాధార ఆరోపణలు, అసత్య ప్రచారంతో మొత్తం అధ్యాపక వర్గాన్ని కించపరచడం కూడా ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది.

నిమ్స్ ప్రతిష్ఠ దశాబ్దాలుగా అధ్యాపకులు, వైద్యులు, పరిశోధకులు, ఆరోగ్య సిబ్బంది అందించిన సేవల ఫలితమని పేర్కొన్న అసోసియేషన్.. పారదర్శక విచారణ,

జవాబుదారీతనం, నైతిక వైద్య విధానాలు, సంస్థాగత సమగ్రతతో పాటు ప్రతి అధ్యాపకుని వృత్తిపరమైన గౌరవాన్ని కాపాడేందుకు కట్టుబడి ఉన్నట్లు తన ప్రకటనలో వెల్లడించింది.

ఫార్మసిస్టుల సేవలు ఆరోగ్య రంగానికి ఎంతో కీలకం





మహబూబాబాద్ జోర్దార్ ప్రతినిధి:ఓరియంటేషన్ ప్రోగ్రాం పురస్కరించుకొని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఫార్మసీ మహబూబాబాద్ లో వేడుకలను ఘనంగా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత గారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఆచార్య గాదే సమ్మయ్య యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మ సూటికల్స్ సైన్స్ కాకతీయ యూనివర్సిటీ గారు మాట్లాడుతూ ఫార్మసిస్టుల ప్రాధాన్యత, ప్రజారోగ్య పరిరక్షణలో వారి పాత్ర, ఔషధాల నాణ్యత, సురక్షితమైన ఔషధ వినియోగం, ఔషధ పరిశోధనల ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

ఫార్మసిస్టులు కేవలం ఔషధాలను అందించే వారే కాకుండా, రోగులకు సరైన ఔషధాల వినియోగంపై మార్గదర్శనం చేస్తూ ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వైద్యులు, ఫార్మసిస్టులు, ఇతర ఆరోగ్య సంరక్షణ నిపుణుల సమన్వయంతో మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని తెలిపారు.

ఫార్మసీ విద్యార్థులు తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకొని, సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఫార్మసి విద్యార్థిని విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ప్రైవేటు మరియు ప్రభుత్వ రంగాలలో అవకాశం ఉందని ఫార్మసీ విద్యార్థులు ఆరోగ్య పరిరక్షణలో వెన్నుపూస వంటి వారని తెలిపారు.

ఫార్మసీ రంగంలో వస్తున్న నూతన మార్పులు, పరిశోధనలు, ఔషధ తయారీ విధానాలు, ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల బాధ్యతల గురించి వివరించారు.ఓరియంటేషన్ ప్రోగ్రాములు పురస్కరించుకొని

విద్యార్థుల్లో వృత్తిపరమైన బాధ్యతను, సేవాభావాన్ని పెంపొందించాయి.

ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వైస్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ , ఫిజికల్ డైరెక్టర్ సునీత

మ్యాక్సింగ్ అంటే ఏమిటి.. దీన్ని ఎలా పాటించాలి..

దీని వల్ల కలిగే లాభాలేమిటి..?



సామాజిక మాధ్యమాల్లో ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలనే ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. ప్రతి భోజనంలో ప్రొటీన్లు చేర్చడం, నిద్రను పర్యవేక్షించడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి అలవాట్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ ధోరణికి మ్యాక్సింగ్ అనే పేరు ప్రాచుర్యంలోకి వచ్చింది. ఒక పనిని గరిష్ఠ స్థాయిలో చేయడం లేదా జీవితంలోని ఒక అంశాన్ని మరింత మెరుగుపరచుకోవడమే దీని అర్థం. 2026 సంవత్సరానికి గాను డిక్షనరీ డాట్ కామ్ ఈ పదాన్ని సంవత్సరపు పదంగా ఎంపిక చేసింది.

ఫిట్‌నెస్, పోషకాహారం, శరీర సౌందర్యం, నిద్ర వంటి అంశాల్లో ఈ ధోరణి కనిపిస్తోంది. అయితే ఆరోగ్యం విషయంలో ఎంత ఎక్కువ చేస్తే అంత మంచిదనే భావన సరికాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అతిగా ఆహారం తీసుకోవడం, విపరీతంగా వ్యాయామం చేయడం, కఠినమైన దినచర్యలను పాటించడం వల్ల ఆరోగ్యానికి మేలు కంటే నష్టమే ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది.

ఫైబర్ మ్యాక్సింగ్ అంటే..

ఈ ధోరణిలో భాగంగా ప్రాచుర్యం పొందిన వాటిలో ఫైబర్ మ్యాక్సింగ్ ఒకటి. జీర్ణక్రియ మెరుగుపడడానికి, మలబద్ధకం తగ్గడానికి పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడమే దీని ఉద్దేశం. పప్పులు, శనగలు, రాజ్మా, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, సంపూర్ణ ధాన్యాలు, గింజల్లో పీచు సమృద్ధిగా ఉంటుంది. అయితే ఒక్కసారిగా పీచు పదార్థాల మోతాదును పెంచితే కడుపు ఉబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు తలెత్తుతాయి. అందుకే క్రమంగా పరిమాణాన్ని పెంచుతూ తగినంత నీరు తాగాలి. ప్రొటీన్‌మ్యాక్సింగ్ పేరుతో కండరాల పెరుగుదల, బరువు నియంత్రణ కోసం అధిక ప్రొటీన్లు తీసుకోవడం మరో ధోరణి. గుడ్లు, పాలు, పెరుగు, పనీర్, చేపలు, చికెన్, సోయా, పప్పుధాన్యాల ద్వారా ప్రొటీన్లు పొందవచ్చు. అయితే ప్రతి ఒక్కరికీ ప్రొటీన్ షేక్స్ లేదా అధిక ప్రొటీన్ పదార్థాలు అవసరం లేదు. ముఖ్యంగా మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు అధిక ప్రొటీన్ ఆహారం తీసుకునే ముందు వైద్యుల సలహా పొందాలి.

ఫిట్‌నెస్ మ్యాక్సింగ్..

ఫిట్‌నెస్‌మ్యాక్సింగ్, జిమ్‌మ్యాక్సింగ్ పేర్లతో శారీరక దృఢత్వం, కండరాల పెరుగుదల కోసం కఠినమైన వ్యాయామాలు చేసే వారి సంఖ్య పెరుగుతోంది. క్రమం తప్పకుండా నడవడం, బలాన్ని పెంచే వ్యాయామాలు చేయడం, శారీరక చురుకుదనాన్ని పెంచుకోవడం మంచిదే. అయితే ప్రతిసారీ గతంలో కంటే ఎక్కువ కష్టపడాలని భావించడం, విశ్రాంతి రోజులను నిర్లక్ష్యం చేయడం వల్ల అలసట, గాయాలు ఏర్పడే వీలు ఉంటుంది. ఇక స్లీప్‌మ్యాక్సింగ్ ద్వారా నిద్ర సమయం, నాణ్యతను మెరుగుపరుచుకోవడంపై దృష్టి పెడుతున్నారు. నిర్దిత సమయానికి నిద్రపోవడం, రాత్రివేళ తెరల వినియోగాన్ని తగ్గించడం, సాయంత్రం తర్వాత కెఫీన్ తీసుకోకపోవడం వంటి అలవాట్లు ఉపయోగకరంగా ఉంటాయి. పెద్దలు సాధారణంగా రోజుకు కనీసం ఏడు గంటలు నిద్రపోవాలి. నిద్రలో సమస్యలు నిరంతరం వేధిస్తే వైద్యులను సంప్రదించాలి.

హైడ్రేషన్‌మ్యాక్సింగ్ పేరుతో ఎక్కువ నీరు తాగడం కూడా ప్రాచుర్యంలో ఉంది. ఎండ, ఉక్కపోత, శారీరక శ్రమ ఎక్కువగా ఉండే పరిస్థితుల్లో తగినంత నీరు తాగడం అవసరమే. అయితే బలవంతంగా అతిగా నీరు తాగితే రక్తంలో సోడియం స్థాయిలు ప్రమాదకరంగా తగ్గే అవకాశం ఉంటుంది. శరీర అవసరాలు, వాతావరణం, ఆరోగ్య పరిస్థితులను బట్టి నీటి పరిమాణాన్ని నిర్ణయించుకోవాలి.

హెల్త్ మ్యాక్సింగ్..

హెల్త్‌మ్యాక్సింగ్ అనేది ఆహారం, వ్యాయామం, నిద్ర, ఆరోగ్య పరీక్షలు, పోషక పదార్థాలు వంటి అన్ని అంశాలను ఒకేసారి మెరుగుపరుచుకోవాలనే విస్తృతమైన ధోరణి. ఇది ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహిస్తే మంచిదే. కానీ ప్రతి విషయాన్నీ లక్ష్యాలు, కొలతలు, ఖరీదైన ఉత్పత్తులతో ముడిపెడితే అనవసరమైన ఒత్తిడి పెరుగుతుంది. ప్రతి ఒక్కరి శరీర అవసరాలు, జీవనశైలి వేర్వేరుగా ఉంటాయని గుర్తించాలి. అన్ని అలవాట్లను ఒకేసారి మార్చుకోవడం కంటే సమతుల్యమైన ఆహారం తీసుకోవడం, రోజూ శారీరక శ్రమ చేయడం, తగినంత నిద్రపోవడం, పొగాకు, మద్యానికి దూరంగా ఉండడం, అవసరమైన ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం వంటి అలవాట్లను క్రమంగా పాటించడం మేలు. భారతీయుల ఆహారంలో పప్పులు, చిరుధాన్యాలు, కూరగాయలు, పెరుగు, కాలానుగుణ పండ్లు చేర్చుకోవడం ద్వారా అధిక ఖర్చు లేకుండానే పోషక అవసరాలను తీర్చుకోవచ్చు.

ఆరోగ్యాన్ని మెరుగుపరుచు కోవడమంటే ప్రతి అంశంలోనూ గరిష్ఠ స్థాయికి చేరుకోవడం కాదు..

తెలంగాణ డెమోక్రటిక్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్

జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ గోపాల్ రావు

- నియామక ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర అధ్యక్షుడు ఉస్మాన్ పాషా



హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:తెలంగాణ డెమోక్రటిక్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడిగా హుజూరాబాద్‌కు చెందిన డాక్టర్ విష్ణుదాసు గోపాల్ రావునియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ఉస్మాన్ పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి జయవర్ధన్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

గోపాల్ రావు గతంలో తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ కార్యదర్శిగా రెండు పర్యాయాలు పనిచేశారు. అలాగే కరీంనగర్ జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడిగా, పలు సంస్థల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి బాధ్యతలు నిర్వహించారు. అంతర్జాతీయ కళాకారుడిగా పలు అవార్డులు అందుకున్నారు.

ఈ సందర్భంగా గోపాల్ రావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి, సంఘం కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఆయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

గుండె పదిలంగా ఉండాలంటే

వంటలో తరచూ ఈ మార్పులు చేయాల్సిందే..!



ఈ మధ్య కాలంలో గుండె జబ్బులు పెరిగిపోతున్నాయి. వాటితోపాటే మరణాలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. వీటిలో చాలా మరణాలకు రక్తంలో కొవ్వు పేరుకుపోవడమే ప్రధాన కారణం అవుతోంది. మరి రక్తంలో కొవ్వు పేరుకోకూడదు అంటే మన ఆహారపు అలవాట్లలో చాలా మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా మనం వాడే వంట నూనె విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మన ఆరోగ్యం కచ్చితంగా ఇంట్లో ఏ వంట నూనె ఉపయోగిస్తున్నామనే దానిపై ఆధారపడి ఉంటుంది.

అదేవిధంగా నూనె రకం ఏదైనా సరే దాన్ని ఎక్కువగా వినియోగించడం కూడా మన గుండె ఆరోగ్యానికి కీడు చేస్తుంది. నూనె ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల సిరల్లో చెడు కొలెస్ట్రాల్ పరిమాణం పెరుగుతుంది. దీనివల్ల ముందుగా అధిక రక్తపోటు వచ్చి ఆ తర్వాత గుండెపోటు, గుండె వైఫల్యం, కరోనరీ ఆర్టరీ డిసీజ్, ట్రిపుల్ వెస్సెల్ డిసీజ్‌లకు దారి తీస్తుంది. కాబట్టి మనం వంట నూనె రకంపైన మాత్రమేగాకుండా వంటల్లో వినియోగించే నూనె మోతాదు విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి.

రక్త నాళాల్లో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి కొన్ని మేలైన వంట నూనెలను మాత్రమే వినియోగించాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నూనె విషయంలో వంటల్లో మార్పు చేయకపోతే అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్లే అవుతుందని హెచ్చరిస్తున్నారు. కొన్ని నూనెలు చెడు కొలెస్ట్రాల్‌కు చెక్ పెడతాయని, వాటిని తీసుకోవడంవల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు.

వేరుశెనగ నూనెతో కొలెస్ట్రాల్ పెరుగుతుందని అంటారు. కానీ ఇది అపోహ అని నిపుణులు అంటున్నారు.


వేరుశనగ నూనెను ఉపయోగించడం ఆరోగ్యానికి మంచిది. వేరుశనగ నూనెలో విటమిన్ ఇ, ఫైటోస్టెరాల్ అధిక మొత్తంలో ఉంటాయి. అయితే అధిక రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవాళ్లు నెలల తరబడి ఒకే నూనెను కాకుండా.. రెండు నెలలకు ఒకసారి నూనె రకాన్ని మారిస్తే బాగుంటుంది. అదేవిధంగా అవిసె గింజలలో ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి అవిసె నూనెను వంటల్లో వాడితే శరీరంలో కొలెస్ట్రాల్‌తోపాటు మంటను తగ్గుతుంది. అయితే అవిసె నూనెను అధిక ఉష్ణోగ్రత వద్ద మరిగించినా, ఫ్రిజ్‌లో పెట్టి కూల్ చేసినా దాని సహజ లక్షణాన్ని కోల్పోతుంది. కాబట్టి అలాంటి పొరపాటు చేయకూడదు.ఆలివ్ నూనె కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. అయితే మన దేశంలో ఆలివ్ నూనె ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. దానిని మధ్యప్రాచ్యం, మధ్యధరా దేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి భారత్‌లో ఆలివ్ నూనె ధర చాలా ఎక్కువగా ఉంటుంది. కానీ ఆర్థిక స్తోమ తను బట్టి అరుదుగానైనా ఆలివ్ నూనెను వంటలో భాగం చేసుకోవడం ముఖ్యం. దీనిలో విటమిన్ ఎ, విటమిన్ డి, విటమిన్ ఇ, విటమిన్ కె ఉంటాయి. అంతేగాక ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సాయపడుతుంది

గులిమి అంటే ఏమిటి.. దీని వల్ల లాభమా, నష్టమా.. తరచూ తొలగించాలా..?

చెవిలో ఏర్పడే గులిమిని వైద్య పరిభాషలో సెరుమెన్ అంటారు. ఈ పదం గ్రీకు భాషలోని కెరోస్ అనే పదం నుంచి వచ్చింది. దాని అర్థం తేనెటీగల మైనం. పురాతన కాలం నుంచే చెవిలో గులిమి గురించి మనుషులు ఆసక్తి చూపుతున్నారు. ప్రపంచంలోని వివిధ పురావస్తు ప్రదేశాల్లో గులిమిని తొలగించేందుకు ఉపయోగించే చిన్న పరికరాలు, చెంచాల వంటి వస్తువులు బయట పడ్డాయి. చెవిలో గులిమిని తొలగించాలా వద్దా అనే సందేహం ఇప్పటికీ చాలామందికి ఉంటుంది. అయితే, వైద్యుల అభిప్రాయం ప్రకారం చెవులు సహజంగానే తమను తాము శుభ్రం చేసుకుంటాయి. గులిమి చెవి లోపలి భాగాన్ని తేమగా ఉంచడమే కాకుండా, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. దుమ్ము, ధూళి, ఇతర చిన్న కణాలు కర్ణభేరి వరకు చేరకుండా అడ్డుకుంటుంది. చెవిలోకి వస్తువులు పెట్టి గులిమిని తొలగించేందుకు ప్రయత్నిస్తే అది మరింత లోపలికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. అలాగే చెవి లోపలి సున్నితమైన చర్మానికి గాయాలు అయ్యే అవకాశం ఉంటుంది.

గులిమితో ఏం జరుగుతుంది..

చెవిలో గులిమి పేరుకుపోయి దారి మూసుకు పోవడం అమెరికా జనాభాలో సుమారు ఐదో వంతు మందికి ఎదురవుతున్న సమస్య. దీనివల్ల



ఏటా దాదాపు 1.2 కోట్ల మంది వైద్యులను సంప్రదిస్తున్నారు. చెవుల్లో పెట్టుకునే ఇయర్‌బడ్స్, వినికిడి పరికరాల వాడకం కూడా గులిమి పేరుకుపోవడానికి కారణం అవుతాయి. పిల్లలు కొన్నిసార్లు లెగో ముక్కలు, రబ్బర్లు వంటి వస్తువులను చెవిలో పెట్టుకుంటారు. పెద్దవారి చెవుల్లో చీమలు, బీటిల్స్, ఈగలు, బొద్దింకలు వంటి కీటకాలు చిక్కుకోవడం కూడా జరుగుతుంది. చెవిలో గులిమి కీటకాలను అడ్డుకునే సహజ రక్షణ కవచంలా పనిచేస్తుందా అనే విషయాన్ని తెలుసుకోవడానికి పరిశోధకులు ప్రయోగాలు చేశారు. చీమలు చెవిలోపలికి వెళ్లే పరిస్థితిని అనుకరించేందుకు గులిమి పూసిన గాజు పాత్రలను ఉపయోగించారు. గరుకుగా ఉన్న గులిమిపై చీమలు నెమ్మదిగా కదిలినా, వాటి కాళ్లలోని గోళ్ల సాయంతో పైకి ఎక్కగలిగాయి.

కానీ నునుపైన గులిమిపైకి ఎక్కడానికి ప్రయత్నించినప్పుడు వెంటనే జారిపడ్డాయి. గులిమి పూసిన సన్నని మార్గంలో చీమలను పంపినప్పుడు వాటి శరీరాలకు గులిమి అంటుకుంది. దాన్ని తొలగించుకునేందుకు అవి తీవ్రంగా ప్రయత్నించినా, కొన్ని నిమిషాల తర్వాత కూడా శరీరంలోని కొన్ని భాగాల్లో గులిమి మిగిలిపోయింది.

చెవుల్లోకి చీమలు చేరగలవా..?

గులిమిలో ఉండే కొవ్వు పదార్థాల వల్ల అది ఒకవైపు జారే స్వభావాన్ని, మరోవైపు అంటుకునే లక్షణాన్ని కలిగి ఉంటుంది. చర్మ కణాల పొరలు ఒక దానితో మరొకటి అతుక్కుని ఏర్పడే ఈ పదార్థంలో సూక్ష్మ రంధ్రాలు ఉంటాయి. నునుపైన గులిమిపై చీమలు తమ కాళ్లలోని తేమతో కూడిన చూషణ భాగాలను ఉపయోగించి పట్టును సాధించలేవు. ఎందుకంటే గులిమిలోని రంధ్రాలు ఆ తేమను పీల్చుకుంటాయి. గులిమి తన బరువుకు రెండింతల నీటిని పీల్చుకున్నప్పటికీ చెవి గోడలకు అంటుకుని ఉండగలుగుతుందని పరిశోధకులు గుర్తించారు. ఈ లక్షణం చెవిలో నీరు పేరుకుపోకుండా అడ్డుకోవడంలో, ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని భావిస్తున్నారు. అయితే, గులిమి, నీరు, బ్యాక్టీరియా మధ్య సంబంధంపై ఇంకా పూర్తిస్థాయి అవగాహన లేదు. కొన్ని పరిశోధనలు గులిమి బ్యాక్టీరియాను చంపుతుందని చెబుతుండగా, మరికొన్ని దానిలో బ్యాక్టీరియా ఉంటుందని సూచిస్తున్నాయి.

గులిమిని శుభ్రం చేయాలా..?

సాధారణంగా చెవిలో గులిమి పేరుకుపోకుండా రెండు సహజ ప్రక్రియలు పనిచేస్తాయి. చెవి కాలువలోని చర్మం కన్వేయర్ బెల్ట్‌లా బయటివైపు కదులుతూ పాత గులిమిని బయటకు నెట్టేస్తుంది. ఈ ప్రక్రియకు సుమారు 8 నుంచి 10 వారాలు పడుతుంది. మరోవైపు, కాలక్రమేణా గులిమి తేమను కోల్పోయి గట్టిపడుతుంది. మాట్లాడేటప్పుడు, నమిలేటప్పుడు చెవి కాలువలో జరిగే కదలికల వల్ల పాత గులిమి విడిపోయి బయటకు వస్తుంది. సహజ గులిమి లక్షణాలను పోలిన కృత్రిమ గులిమిని తయారుచేసి చేసిన ప్రయోగాల్లో నూ చీమలు దానిపై కదలడానికి ఇబ్బంది పడ్డాయి. ఈ పరిశోధన ఆధారంగా భవిష్యత్తులో సురక్షితమైన కీటక నివారణ పద్ధతులను అభివృద్ధి చేసే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే, సహజ గులిమిని సేకరించడం, కృత్రిమ గులిమిని తయారుచేయడం ఖర్చుతో కూడుకున్న పని కావడంతో ప్రస్తుతం ఇవి పెద్ద స్థాయిలో కీటక నివారణ మందులకు ప్రత్యామ్నాయంగా మారే అవకాశం లేదని పరిశోధకులు పేర్కొన్నారు

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీత అంతం - మా పంతం
గురువారం,
నవంబర్ 05 2026

తొలి వన్డేకు టీమిండియా ప్లేయింగ్ 11 ఫిక్స్..?



టీ20 సిరీస్ తర్వాత భారత్ ఇప్పుడు న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల సిరీస్ ఆడనుంది. తొలి వన్డేకు ముందు ఆటగాళ్లంతా సన్నాహాల్లో నిమగ్నమయ్యారు. కివీస్‌ను ఈ ఫార్మాట్‌లో ఓడించడం సులువు కాదు.టాప్-4 బ్యాటర్లలో మార్పు లేనట్లే..తొలి వన్డేలో భారత బ్యాటింగ్ ఆర్డర్ దాదాపు సెట్ అయినట్లు కనిపిస్తోంది. ఓపెనింగ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు అనుభవజ్ఞుడైన రోహిత్ శర్మ బరిలోకి దిగడం ఖాయం. వెస్టిండీస్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో ఈ ఇద్దరూ అద్భుతంగా రాణించారు. అయితే విదేశీ గడ్డపై, న్యూజిలాండ్‌లో రోహిత్ ఎలా ఆడతాడనే దానిపై ఆసక్తి నెలకొంది.

మూడో స్థానంలో విరాట్ కోహ్లీ (ఆడతాడు. కివీస్‌పై కూడా ధనాధన్ ఇన్నింగ్స్ ఆశిస్తున్నారు. వైస్ కెప్టెన్ (శేయస్ అయ్యర్ () నాలుగో స్థానంలో వస్తాడు. 2026 ఆసియా క్రీడల కారణంగా అతడు వెస్టిండీస్ సిరీస్‌లో ఆడలేదు.మిడిలార్డర్‌లో రాహుల్, అక్షర్, నితీశ్, నమన్..టాప్-4 తర్వాత ఐదో స్థానంలో వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ (ఖూ ష్ణబశ్రీ) రావచ్చు. గత వన్డే సిరీస్‌లో అతడికి ఒక్క ఇన్నింగ్స్ మాత్రమే దక్కింది. ఆ ఇన్నింగ్స్‌లో సెంచరీ చేశాడు. స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ (ూఇఖతీ గ్ఖ్ఘవశ్రీ)ను ఆరో స్థానంలో పంపే అవకాశం ఉంది.పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా నితీశ్ కుమార్ రెడ్డి (ఆడటం ఖాయంగా కనిపిస్తోంది. వేగంగా పరుగులు చేయడంతో పాటు ఆఫ్ స్పిన్ కూడా వేసే నమన్ ధీర్)కు కూడా చోటు దక్కవచ్చు.బౌలింగ్ విభాగం..భారత స్క్వాడ్‌లో ఏకైక స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (ఖబశ్రీనవవజూ ష్ణుఖజ). తొలి వన్డేలో అతడు ఆడే అవకాశం ఉంది. కుల్దీప్ స్పిన్‌కు కివీస్ బ్యాటర్లు ఇబ్బంది పడవచ్చు. పేస్ విభాగంలో అనుభవజ్ఞుడైన మహమ్మద్ సిరాజ్ తో పాటు గుర్నూర్ బ్రార్ ()కు చోటు దక్కవచ్చు. గుర్నూర్ ఉండటం వల్ల బ్యాటింగ్ డెప్త్ కూడా పెరుగుతుంది.

ఇదేందయ్యా రోహిత్.. కివీస్ గడ్డపై ఇంకా ఆ రికార్డ్ లేదా



ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్, న్యూజిలాండ్ వన్డే సిరీస్ ప్రారంభం కాబోతోంది. తొలి వన్డే నవంబర్ 4, 2026న ఈడెన్ పార్క్‌లో జరుగుతుంది. భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ పైనే అందరి చూపు ఉంది. 2027 వన్డే వరల్డ్ కప్‌నకు సిద్ధమయ్యేందుకు, రిథమ్ అందుకునేందుకు ఈ సిరీస్‌ను అతడు సద్వినియోగం చేసుకోవాలని చూస్తున్నాడు.కివీస్‌పై ఓవరాల్ వన్డే రికార్డ్..న్యూజిలాండ్‌పై రోహిత్ 34 వన్డేలు ఆడి 1,134 పరుగులు చేశాడు. సగటు 36.58 కాగా, స్ట్రైక్ రేట్ 85.26. ఇందులో 2 సెంచరీలు, 6 అర్ధ సెంచరీలు ఉన్నాయి.న్యూజిలాండ్ గడ్డపై రికార్డ్..

కివీస్ గడ్డపై రోహిత్ 14 వన్డేలు ఆడి 437 పరుగులు చేశాడు. సగటు 36.42, స్ట్రైక్ రేట్ 72.95. ఆసక్తికరంగా, న్యూజిలాండ్‌లో అతడు ఇప్పటివరకు ఒక్క వన్డే సెంచరీ కూడా చేయలేదు. అయితే నాలుగు అర్ధ సెంచరీలు సాధించాడు.న్యూజిలాండ్‌పై రోహిత్ చేసిన రెండు వన్డే సెంచరీలూ భారత గడ్డపైనే వచ్చాయి. 2017లో కాన్పూర్‌లో 147 పరుగులు, 2023లో ఇండోర్‌లో 101 పరుగులు చేశాడు. ఇప్పుడు కివీస్ గడ్డపై తొలి వన్డే శతకం కోసం హిట్‌మ్యాన్ ఎదురుచూస్తున్నాడు.

తొలి రౌండ్ వేలంలో ఐదుగురు.. నలుగురు మనోళ్లే..!



మహిళల ప్రీమియర్ లీగ్ 2027 మినీ-వేలం కోసం సన్నాహాలు ప్రారంభమయ్యాయి. కేరళలోని కొచ్చిలో ఉన్న గ్రాండ్ హయత్ హోటల్‌లో రేపు (అక్టోబర్ 28) సాయంత్రం జరగనున్న ప్లేయర్స్ వేలంలో మొత్తం 146 మంది మహిళా క్రికెటర్ల పేర్లను ప్రకటించనున్నారు.ఈ 146 మంది ఆటగాళ్లలో, మొదటి సెట్‌లో 6 మంది ఆటగాళ్లను ఎంపిక చేశారు. అంటే, మొదట ఈ ఆరుగురు ఆటగాళ్ల కోసం బిడ్డింగ్ జరుగుతుంది, ఆ తర్వాత ఆల్‌రౌండర్లు మరియు వికెట్ కీపర్ల కోసం వేలం ప్రక్రియ నిర్వహించబడుతుంది. దానికి అనుగుణంగా, మొదటి రౌండ్ బిడ్డింగ్‌లో కనిపించే 6 మంది ఆటగాళ్ల జాబితా ఇక్కడ ఉంది.సోఫియా డంక్లీ: ఇంగ్లండ్ విధ్వంసకర బ్యాట్స్‌మన్ సోఫియా డంక్లీ, 50 లక్షల రూపాయల కనీస ధర్వంసకర బ్యాట్స్‌మన్ సోఫియా డంక్లీ, 50 లతో వేలం జాబితాలో చేర్చబడింది. గతంలో గుజరాత్ జెయింట్స్ తరఫున ఆడిన డంక్లీ, వేలం తొలి జాబితాలో ఉంది.గుణాలన్ కమలినీ: భారతదేశపు ప్రతిభావంతురాలైన యువ క్రీడాకారిణి గుణాలన్ కమలినీ ఈసారి తన కనీస ధ్వంసకర బ్యాట్స్‌మన్ సోఫియా డంక్లీ, 50 లర రూ. 40 లక్షలుగా ప్రకటించింది. గత సీజన్‌లో ముంబై ఇండియన్స్ జట్టులో ఉన్న కమలినీ, ఈసారి కొత్త జట్టులో చేరే అవకాశం ఉంది.

డీమార్ట్‌లో తక్కువ ధరకే సరుకులు కొనాలంటే ఏం రోజు వెళ్తే మంచిది?



నెలవారీ నిత్యావసర సరుకులు కొనుగోలు చేయాలంటే చాలామందికి ముందుగా గుర్తుకొచ్చే పేరు డీమార్ట్. బియ్యం, పప్పులు, నూనె నుంచి సబ్బులు, డిటర్జెంట్లు, టూత్‌పేస్ట్‌ల వరకు ఎన్నో వస్తువులు ఒకే చోట లభించడంతో వినియోగదారులు ఈ స్టోర్లకు ప్రాధాన్యం ఇస్తుంటారు. అయితే డీమార్ట్‌కు ఏ రోజు వెళ్తే తక్కువ రద్దీ ఉంటుంది? ఏ సమయంలో షాపింగ్ చేస్తే సౌకర్యంగా ఉంటుంది? నిజంగా డబ్బు ఆదా చేయాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఇప్పుడు తెలుసుకుందాం.

డీమార్ట్‌లో ప్రశాంతంగా షాపింగ్ చేయాలనుకునే వారు సాధ్యమైనంతవరకు సోమవారం నుంచి గురువారం మధ్యలో వెళ్లడాన్ని పరిశీలించవచ్చు. ముఖ్యంగా ఉదయం స్టోర్ తెరిచిన తర్వాత లేదా రద్దీ తక్కువగా ఉండే సమయంలో వెళ్లడం వల్ల బిల్లింగ్ కౌంటర్ల వద్ద ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం తగ్గవచ్చు. అయితే అన్ని స్టోర్లలోనూ ఇదే పరిస్థితి ఉంటుందని చెప్పలేం. ప్రాంతం, స్థానిక కొనుగోళ్ల తీరు, పండుగలు, సెలవులను బట్టి రద్దీ మారుతుంది. అందువల్ల మీకు దగ్గరలోని స్టోర్‌కు వెళ్లే సమయాన్ని వీలైతే ముందుగానే ప్లాన్ చేసుకోవడం మంచిది.నెల చివర్లో వెళ్తే ఎక్కువ డిస్కౌంట్లు వస్తాయా?డీమార్ట్‌లో నెల చివరి రోజుల్లోనే ఎక్కువ డిస్కౌంట్లు లభిస్తాయని చాలామంది భావిస్తుంటారు. అయితే ప్రతి నెల చివరి తేదీల్లోనే ప్రత్యేక ఆఫర్లు ఉంటాయని నిర్ధారించే అధికారిక సమాచారం ఏమి ఉండదు. కొన్ని ఉత్పత్తులపై ప్రత్యేక ధరలు, బహుళ ప్యాక్‌లపై తగ్గింపులు, అదనపు వస్తువులు ఉచితంగా ఇచ్చే ఆఫర్లు వివిధ సమయాల్లో కనిపించవచ్చు. అందుకే నెల చివరి వరకు వేచి ఉండటం కంటే, మీకు అవసరమైన వస్తువుల ధరలను ఎప్పటికప్పుడు పరిశీలించడం ప్రయోజనకరం.వీకెండ్‌లో షాపింగ్ చేయడం మంచిదేనా?శనివారం, ఆదివారం రోజుల్లో ఉద్యోగాలు చేసే వారు, కుటుంబాలతో షాపింగ్‌కు వచ్చే వారు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. అందువల్ల కొన్ని స్టోర్లలో రద్దీ పెరగవచ్చు. ముఖ్యంగా పండుగలకు ముందు, నెలవారీ సరుకులు కొనుగోలు చేసే సమయాల్లో ఈ పరిస్థితి కనిపించవచ్చు.వీకెండ్‌లోనే వెళ్లాల్సి వస్తే వీలైనంత త్వరగా వెళ్లడం, ముందుగానే షాపింగ్ జాబితా సిద్ధం చేసుకోవడం మంచిది. అయితే వీకెండ్‌లోనే మంచి ఆఫర్లు ఉంటాయని లేదా ఆ రోజుల్లో ధరలు ఉంటాయని నిర్ధారించలేం. ఆఫర్లు ఉత్పత్తిని బట్టి మారుతుంటాయి.

దీపావళి.. పటాకుల ప్రమాదాలకు ఇన్సూరెన్స్ వర్తిస్తుందా? క్లెయిమ్ విధానం ఏంటి?



దీపావళి భారతదేశం అంతటా అత్యంత ప్రజాదరణ పొందిన పండుగ, నిని కోట్లాది మంది ప్రజలు ఎంతో ఉత్సాహంతో జరుపుకుంటారు. దీపావళి పండుగ అంటే కేవలం టపాసులు కాల్చడం, కొత్త బట్టలు వేసుకోవడం మాత్రమే కాదు. ఇందులో ఆనందంతో పాటు అంతే ప్రమాదం కూడా ఉంటుంది. ముఖ్యంగా దీపావళి పండుగ సమయంలో టపాసులు పేలడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ ప్రమాదాల వల్ల మీకు గాయాలు కావచ్చు. అలాగే వైద్య చికిత్స కూడా అవసరం కావచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో టపాసుల ప్రమాదాలకు బీమా వర్తిస్తుందో లేదో తెలుసుకోవడం చాలా ముఖ్యం.

బాణసంచా ప్రమాదాలకు బీమా సౌకర్యం ఉందా?

చాలా మంది బాణసంచా సంబంధిత ప్రమాదాలకు బీమాను క్లెయిమ్ చేసుకోవచ్చని అనుకుంటారు. అయితే, అది నిజం కాదు. మీరు తీసుకున్న బీమా రకాన్ని బట్టి, మీకు ఏ రకమైన సమస్యలు, ప్రమాదాలకు కవరేజ్ లభిస్తుందో నిర్ణయించవచ్చు.

స్వల్పకాలిక బాణసంచా బీమా పథకాలు:

అందుకే స్వల్పకాలిక పటాకుల బీమా పథకాలు ఉన్నాయి. దీనికోసం సాధారణ ఆరోగ్య బీమా, ప్రమాద బీమా పథకాలను పరిగణనలోకి తీసుకోవడం ముఖ్యం. పటాకుల ప్రమాదాల వల్ల కలిగే నష్టాలకు మీరు గృహ బీమా ద్వారా కూడా ప్రయోజనాలను పొందవచ్చు. ప్రతి పథకం విభిన్న రకాల కవరేజీని, ప్రత్యేక ఫీచర్లను అందిస్తుంది.దీపావళి భారతదేశం అంతటా అత్యంత ప్రజాదరణ పొందిన పండుగ, నిని కోట్లాది మంది ప్రజలు ఎంతో ఉత్సాహంతో జరుపుకుంటారు. దీపావళి పండుగ అంటే కేవలం టపాసులు కాల్చడం, కొత్త బట్టలు వేసుకోవడం మాత్రమే కాదు. ఇందులో ఆనందంతో పాటు అంతే ప్రమాదం కూడా ఉంటుంది. ముఖ్యంగా దీపావళి పండుగ సమయంలో టపాసులు పేలడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ ప్రమాదాల వల్ల మీకు గాయాలు కావచ్చు. అలాగే వైద్య చికిత్స కూడా అవసరం కావచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో టపాసుల ప్రమాదాలకు బీమా వర్తిస్తుందో లేదో తెలుసుకోవడం చాలా ముఖ్యం.

బాణసంచా ప్రమాదాలకు బీమా సౌకర్యం ఉందా?

చాలా మంది బాణసంచా సంబంధిత ప్రమాదాలకు బీమాను క్లెయిమ్ చేసుకోవచ్చని అనుకుంటారు. అయితే, అది నిజం కాదు. మీరు తీసుకున్న బీమా రకాన్ని బట్టి, మీకు ఏ రకమైన సమస్యలు, ప్రమాదాలకు కవరేజ్ లభిస్తుందో నిర్ణయించవచ్చు.స్వల్పకాలిక బాణసంచా బీమా పథకాలు:అందుకే స్వల్పకాలిక పటాకుల బీమా పథకాలు ఉన్నాయి. దీనికోసం సాధారణ ఆరోగ్య బీమా, ప్రమాద బీమా పథకాలను పరిగణనలోకి తీసుకోవడం ముఖ్యం. పటాకుల ప్రమాదాల వల్ల కలిగే

ధంతేరస్‌కు ముందు పడిపోయిన బంగారం, వెండి ధరలు..



ధంతేరస్‌కు, దీపావళి పండుగలకు ముందు పసిడి ప్రియులకు ఊరట లభించింది. రికార్డ్ స్థాయిల నుంచి బంగారం, వెండి ధరలు భారీగా పడిపోయాయి. పండుగ వేళ ఆభరణాలు లేదా పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి ఇది మంచి అవకాశమా లేక ధరలు మరింత తగ్గే వరకు వేచి చూడాలా అనే దానిపై మార్కెట్ నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు.ధరల్లో భారీ పతనం:మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజశ)లో బంగారం ధరలు ఒక్కసారిగా క్షీణించి, రూ.1.40 లక్షల దిగువకు పడిపోయాయి. అలాగే వెండి ధరలు కూడా భారీగా పడిపోయి కిలోకి సుమారు రూ.1.80 లక్షల దిగువకు చేరాయి. జనవరి నెలలో నమోదైన గరిష్ట రికార్డులతో పోలిస్తే వెండి మరియు బంగారం ధరలు గణనీయంగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న పరిణామాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల అంచనాలు ఈ ధరల తగ్గుదలకు ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు.

ఇప్పుడు కొనాలా? వేచి చూడాలా?కొనుగోలుదారులకు అనుకూలం: ధంతేరస్ సందర్భంగా బంగారం లేదా వెండి కొనుగోలు చేయాలని భావించే వారికి ప్రస్తుత ధరల తగ్గుదల మంచి ఊరటని ఇస్తుంది. రికార్డ్ గరిష్ట ధరలతో పోలిస్తే ఇప్పుడు రేట్లు తక్కువగా ఉండటంతో వినియోగదారులు ముందుకు వస్తున్నారు.మార్కెట్ నిపుణుల సలహా: నిపుణుల అభిప్రాయం ప్రకారం, పండుగ రోజు ఒక్కరోజే మొత్తం కొనుగోలు చేయకుండా, అవసరాన్ని బట్టి విడతలవారీగా కొనుగోలు చేయడం శ్రేయస్కరం. ఇది మార్కెట్ హెచ్చుతగ్గుల నుంచి రక్షణ కల్పిస్తుంది. దీపావళి, ధంతేరస్ వేళ బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి ఈ ధరల సవరణ ఒక మంచి కొనుగోలు అవకాశాన్ని అందిస్తోందని అక్టోబర్‌లో వెండి ఫ్యూచర్లు సుమారు 20 శాతం, బంగారం ఫ్యూచర్లు దాదాపు 7 శాతం పడిపోయిన తీవ్రమైన దిద్దుబాటు తర్వాత ఈ పతనం చోటుచేసుకుంది. వినియోగదారులు లోహం స్వచ్ఛతను కూడా తనిఖీ చేయాలి. ఆభరణాల కోసం సాధారణంగా 22-క్యారెట్ల బంగారాన్ని ఉపయోగిస్తున్నప్పటికీ, డిజైన్ల కోసం 18-క్యారెట్ల బంగారం ప్రజాదరణ పొందుతోంది. కొనుగోలు చేసే ముందు, దీ×ూ హాల్‌మార్క్ స్వచ్ఛత మార్కింగ్, ఆరు అంకెల హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ (ఎఖ×ణ) కోడ్‌ను తనిఖీ చేయండి. దీ×ూ కేర్ యాప్ ద్వారా ఎఖ×ణని ధృవీకరించుకోవచ్చు.చెప్పవచ్చు.అక్టోబర్‌లో వెండి ఫ్యూచర్లు సుమారు 20 శాతం, బంగారం ఫ్యూచర్లు దాదాపు 7 శాతం పడిపోయిన తీవ్రమైన దిద్దుబాటు తర్వాత ఈ పతనం చోటుచేసుకుంది. వినియోగదారులు లోహం స్వచ్ఛతను కూడా తనిఖీ చేయాలి. ఆభరణాల కోసం సాధారణంగా 22-క్యారెట్ల బంగారాన్ని ఉపయోగిస్తున్నప్పటికీ, డిజైన్ల కోసం 18-క్యారెట్ల బంగారం ప్రజాదరణ పొందుతోంది. కొనుగోలు చేసే ముందు, దీ×ూ హాల్‌మార్క్ స్వచ్ఛత మార్కింగ్, ఆరు అంకెల హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ (ఎఖ×ణ) కోడ్‌ను తనిఖీ చేయండి. దీ×ూ కేర్ యాప్ ద్వారా ఎఖ×ణని

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

ఆ టాలీవుడ్ హీరో అంటే చాలా ఇష్టం..



తెలుగు సినిమా పరిశ్రమలో వరుస అవకాశాలతో దూసుకుపోతోంది యంగ్ హీరోయిన్ రితికా నాయక్. విశ్వక్ సేన్ 'అశోకవనంలో అర్జున కల్యాణం'తో తెలుగు ఆడియెన్స్ ను పలకరించిన ఈ ముద్దుగుమ్మ ఆ తర్వాత నానితో కలిసి హాయ్ నాన్న అనే సినిమాలో యాక్ట్ చేసింది. ఇక తేజ సజ్జా తో కలిసి రితికా నటించిన మిరాయ్ సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఏకంగా రూ.300 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. మిరాయ్ సినిమాతో పాన్ ఇండియా రేంజ్ లో ఫేమస్ అయిపోయింది రితిక. ఇక ఆ మధ్యన వరుణ్ తేజ్ తో కలిసి ఆమె నటించిన కొరియన్ కనకరాజు కూడా సూపర్ హిట్ గా నిలిచింది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ చేతిలో పలు క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో సందీప్ కిషన్ పవర్ పేట ఒకటి కాగా, డ్యూయెట్ అనే ఓ తమిళ బైలింగువల్ సినిమా కూడా ఉంది. ప్రస్తుతం ఈ సినిమాల షూటింగుల్లో బిజీగా ఉంటోంది రితికా నాకక్. ఇదిలా ఉంటే మంగళవారం (అక్టోబర్ 27) రితికా నాయక్ పుట్టిన రోజు. ఈ నేపథ్యంలో పలువురు సినీ ప్రముఖులు, సినీ అభిమానులు, నెటిజన్లు ఈముద్దుగుమ్మకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇదే క్రమంలో రితికాకు సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలు మరోసారి నెట్టింట వైరలవుతున్నాయి. అలాగే గతంలో కొన్ని ఇంటర్వ్యూల్లో ఆమె చెప్పిన మాటలు కూడా మరోసారి తెర మీదకు వస్తున్నాయి'నాకు అందమైన రూపం ఉందని మాత్రమే కాకుండా.. 'బాగా నటిస్తుంది' అని ప్రేక్షకులు అనుకోవాలన్నదే నా లక్ష్యం. అన్ని రకాల పాత్రల్లోనూ నటించాలని ఉంది. ఒక్క తరహా పాత్రలకే పరిమితం కావడం నాకు ఇష్టం లేదు' అని ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది రితిక. మీ క్రష్ ఎవరని రితికాను ఓ సందర్భంలో అడగ్గా.. తనకు అల్లు

రిలీజ్‌కు ముందే 'రామాయణం' రికార్డులు



రణబీర్ కపూర్, సాయి పల్లవి, యష్ ప్రధాన పాత్రలలో నటించిన 'రామాయణం' చిత్రం, విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్‌లలో కొత్త రికార్డు సృష్టించింది. ఈ సినిమా విడుదలకు కేవలం కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉండగా, ఈ చిత్రం అడ్వాన్స్ టికెట్ అమ్మకాలలో రూ. 100 కోట్ల మార్కును దాటింది. సినిమా విడుదలకు ముందే అడ్వాన్స్ టికెట్ల ద్వారా 100 కోట్లు సంపాదించిన చిత్రాలు చాలా తక్కువ ఉన్నాయి. ఇప్పుడు 'రామాయణం' కూడా ఆ జాబితాలో చేరింది. 'రామాయణం' సినిమా గురువారం అంటే నవంబర్ 5న విడుదల కానుంది. దసరా పండుగకు కొద్ది రోజుల ముందే ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభమైంది. 'రామాయణం' సినిమా అడ్వాన్స్ బుకింగ్ 15 రోజుల ముందే మొదలవడం సినిమాకు పెద్ద అడ్వాంటేజ్ గా మారింది. తొలి కొన్ని రోజులు ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్ కాస్త నెమ్మదిగా సాగింది. కానీ రోజులు గడిచేకొద్దీ సినిమాపై ఆసక్తి పెరిగి, అడ్వాన్స్ బుకింగ్ భారీగా జరుగుతోంది. మొదట్లో ముంబై, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో మాత్రమే అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభించారు. అది కూడా పరిమిత స్క్రీన్లకు మాత్రమే. చాలా సింగిల్-స్క్రీన్, చిన్న సెంటర్లలో గత వారం వరకు అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభం కాలేదు. దీనికి కారణం, సినిమా పంపిణీదారు అయిన ధర్మ ప్రొడక్షన్స్, అధిక ఆదాయ వాటా కోసం ఎగ్జిబిటర్లతో చర్చలు జరపడమే. ఆ తర్వాత గత శుక్రవారం ఒప్పంద సంక్షోభం పరిష్కారం కావడంతో, వారాంతానికి చాలా థియేటర్లలో స్క్రీన్లను జోడించారు.గత మూడు రోజులుగా 'రామాయణం' సినిమా ప్రపంచవ్యాప్త అడ్వాన్స్ అమ్మకాలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా లాస్ ఏంజిల్స్‌లో సినిమా ప్రీమియర్ షో జరిగిన తర్వాత, అమెరికాలో టికెట్ల అమ్మకాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. మంగళవారం ఉదయానికల్లా, ఈ సినిమా స్క్రీన్ల సంఖ్య 5000 దాటింది. ఇందులో, కేవలం గత 24 గంటల్లోనే 1500కు పైగా స్క్రీన్లు కొత్తగా చేరాయి. విడుదలకు రెండు రోజుల ముందు, నవంబర్ 3వ తేదీ ఉదయానికల్లా, ఈ చిత్రం భారతదేశంలో అడ్వాన్స్ అమ్మకాల ద్వారా రూ. 58 కోట్ల వసూళ్లు వచ్చాయి.. ఇందులో మొదటి రోజే జరిగిన అడ్వాన్స్ బుకింగ్‌ల ద్వారా వచ్చిన రూ. 27 కోట్ల ఆకట్టుకునే వసూళ్లు కూడా ఉన్నాయి. విశేషం ఏమిటంటే, విడుదలైన మొదటి రోజే కాకుండా, వారాంతం మొత్తం మీద కూడా భారీ డిమాండ్ ఉంది. ఇప్పటివరకు, కేవలం 2వ, 3వ రోజుల

నిహారికలాంటి ప్రొడ్యూసర్‌ని నా కెరీర్‌లోనే చూడలేదు..



నిహారిక కొణిదెల పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, మాక్సిమం సిటీ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తోన్న చిత్రం పాకెట్ రాకెట్స్. రుద్ర అత్రి దర్శకత్వం వహిస్తున్నారు. పద్మజ కొణిదెల, రాహుల్ రాఘవేంద్ర, రాహుల్ నిమ్మకూరి నిర్మాతలు. డిసెంబర్ 11న సినిమా విడుదలకానుంది. యూత్ ఫుల్ ఎంటర్టైనర్‌గా రానున్న ఈ మూవీలో త్రినాథ్ వర్మ (కమిటీ కుర్రోళ్ళు ఫేమ్) , నిర్మల్ (డెబ్యూ) హీరోలుగా... శ్రియా కొంతం (శుభం ఫేమ్) హీరోయిన్‌గా .. జేడీ చక్రవర్తి ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. గ్యాబ్లింగ్ చుట్టూ తిరిగే ఈ సినిమా నుంచి మంగళవారం రోజున ది ఫస్ట్ హ్యాండ్ అంటూ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన పాత్రికేయుల సమావేశంలో.. నిహారిక కొణిదెల మాట్లాడుతూ .. "పాకెట్ రాకెట్స్' చిత్రాన్ని జులైలో ప్రారంభించాం. రుద్రతో మాకు ఎన్నో ఏళ్ల నుంచి పరిచయం ఉంది. టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను. అంజి, ఏసు, జేడీ గారి పాత్రలు అద్భుతంగా ఉంటాయి. ఆరు నెలల్లో సినిమాని పూర్తి చేసి, రిలీజ్ చేస్తున్నాం. డిసెంబర్ 11న మా చిత్రం రాబోతోంది. ఇక రిలీజ్ వరకు మేమంతా మీ సోషల్ మీడియాలోకి, మీ ఇంట్లోకి వచ్చేస్తాం' అని అన్నారు.జేడీ చక్రవర్తి మాట్లాడుతూ .. "పాకెట్ రాకెట్స్' సినిమా కోసం నేను అక్టోబర్‌లో షూట్ చేశాను. నవంబర్‌లో టీజర్ అన్నారు, డిసెంబర్‌లో రిలీజ్ చేస్తున్నారు. నా లైఫ్‌లో నిహారిక లాంటి గ్రేట్ ప్రొడ్యూసర్‌ని చూడలేదు. ఈ సినిమా స్కేల్‌ని మన్యం రమేష్ గారు పెంచారు. రుద్ర గారు ఏం తీశారు, ఎంత గొప్పగా చేశారు అన్నది థియేటర్లోనే చూసి తెలుసుకోండి. ఈ సినిమా డిసెంబర్ 11న రాబోతోంది. అందరూ తప్పకుండా చూడండి' అని అన్నారు. దర్శకుడు రుద్ర అత్రి మాట్లాడుతూ .. "పాకెట్ రాకెట్స్' టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని ఆశిస్తున్నాను. నాకు ఇంతలా సపోర్ట్ చేసిన నిహారిక గారికి థాంక్స్. నా టీం ఇచ్చిన సపోర్ట్ వల్లే సినిమాని ఇంత వేగంగా పూర్తి చేయగలిగాను. నాకు సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్' అని అన్నారు.మ్యూజిక్ డైరెక్టర్ గ్యానీ మాట్లాడుతూ.. "పాకెట్ రాకెట్స్' టీజర్ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. సినిమా బాగా వచ్చింది. అందరూ ప్రాణం పెట్టి పని చేశారు. డిసెంబర్ 11న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు. త్రినాథ వర్మ మాట్లాడుతూ.. "పాకెట్ రాకెట్స్'లో నేను అంజి అనే పాత్రలో కనిపిస్తాను. జీవితాన్ని మార్చుకోవాలని, అవకాశం రావాలని తపన పడే కుర్రాడి పాత్ర. నా జీవితంలోని పాత్రకు కనెక్ట్ అయ్యాను. నన్ను మళ్లీ హీరోగా నిలబెట్టిన నిహారిక గారు, మన్యం రమేష్ గారికి థాంక్స్. ఇద్దరు కుర్రాళ్లు తమ జీవితాల్ని


వరుసగా ఆరు ఫ్లాపులు.. అయినా చేతిలో ఏకంగా అరడజను సినిమాలు..



హీరోలతో పోల్చితే సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్ల కెరీర్ చాలా తక్కువగా ఉంటుంది. వరుసగా రెండు, మూడు ఫ్లాపులు పడితే చాలు హీరోయిన్లకు అవకాశాలు కరవవుతాయి. ఫలితంగా సినిమా ఇండస్ట్రీ నుంచి ఫేడవుట్ అయిపోతారు. అయితే టాలీవుడ్ హీరోయిన్ నిధి అగర్వాల్ ఇందుకు

హైదరాబాద్ లో పుట్టి బెంగళూరులో పెరిగింది నిధి అగర్వాల్. మోడల్ గా కెరీర్ ప్రారంభించిన ఈ ముద్దుగుమ్మ 2017లో మున్నా మైఖెల్ అనే హిందీ సినిమాతో వెండితెరకు పరిచయమైంది. ఆ తర్వాత తెలుగు ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది.హైదరాబాద్ లో పుట్టి బెంగళూరులో పెరిగింది నిధి అగర్వాల్. మోడల్ గా కెరీర్ ప్రారంభించిన ఈ ముద్దుగుమ్మ 2017లో మున్నా మైఖెల్ అనే హిందీ సినిమాతో వెండితెరకు పరిచయమైంది. ఆ తర్వాత తెలుగు ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. 2018లో అక్కినేని నాగ చైతన్య నటించిన సవ్యసాచి సినిమాతో తెలుగు ఆడియెన్స్ ను పలకరించింది నిధి. ఈ సినిమా బాగా ఆడడంతో ఈ ముద్దుగుమ్మకు వరుసగా అవకాశాలు క్యూ కట్టాయి. అక్కినేని అఖిల్ తో నటించిన మిస్టర్ మజ్ను నిరాశపరిచినా ఇస్మార్ట్ శంకర్ ఈ బ్యూటీకి మంచి క్రేజ్ తీసుకొచ్చింది.2018లో అక్కినేని నాగ చైతన్య నటించిన సవ్యసాచి సినిమాతో తెలుగు ఆడియెన్స్ ను పలకరించింది నిధి. ఈ సినిమా బాగా ఆడడంతో ఈ ముద్దుగుమ్మకు వరుసగా అవకాశాలు క్యూ కట్టాయి. అక్కినేని అఖిల్ తో నటించిన మిస్టర్ మజ్ను నిరాశపరిచినా ఇస్మార్ట్ శంకర్ ఈ బ్యూటీకి మంచి క్రేజ్ తీసుకొచ్చింది. ఇస్మార్ట్ శంకర్ సినిమాలో నిధి అందం, అభినయానికి అందరూ ఫిదా అయిపోయారు. సినిమా కూడా బ్లాక్ బస్టర్ కావడంతో ఈ ముద్దుగుమ్మ క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు వచ్చాయి.ఇస్మార్ట్ శంకర్ సినిమాలో నిధి అందం, అభినయానికి అందరూ ఫిదా అయిపోయారు. సినిమా కూడా బ్లాక్ బస్టర్ కావడంతో ఈ ముద్దుగుమ్మ క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. ఇస్మార్ట్ శంకర్ తర్వాత సుమారు 6 సినిమాల్లో నటించింది నిధి. అందులో పవన్, ప్రభాస్ సినిమాలు కూడా ఉన్నాయి. కానీ ఈ సినిమాలేవీ పెద్దగా ఆడలేదు. అయితే ఇప్పటికీ ఈ బ్యూటీ చేతిలో సుమారు అరడజను సినిమాలు ఉన్నాయి. ఇస్మార్ట్ శంకర్ తర్వాత

మమిత బైజు అసలు పేరు ఏంటో తెలుసా.?



సినిమా ఇండస్ట్రీలో ఒక్క సినిమాతోనే ఓవర్‌నైట్ స్టార్‌డమ్ సంపాదించుకునే హీరోయిన్లు చాలా తక్కువ మంది ఉంటారు. అలాంటి వారిలో మలయాళ ముద్దుగుమ్మ మమిత బైజు ఒకరు. 'ప్రేమలు' సినిమాతో కుర్రకారుకు ఫేవరెట్‌గా మారిన ఈ బ్యూటీ.. ప్రస్తుతం దక్షిణాది చిత్ర పరిశ్రమలో వరుస అవకాశాలతో దూసుకుపోతోంది.తన అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గరైన మమిత.. తాజాగా తన పేరు వెనుక ఉన్న ఆసక్తికరమైన కథను బయటపెట్టింది. అసలు తన పేరు మమిత కాదని, చిన్నప్పుడే జరిగిన ఓ పొరపాటు కారణంగా పేరు మారిపోయిందని వెల్లడించింది.సాధారణంగా పిల్లలకు పేరు పెట్టే విషయంలో తల్లిదండ్రులు ఎంతో ఆలోచిస్తారు. తమకు నచ్చిన పేరును ఎంతో ఇష్టంగా ఎంపిక చేసుకుంటారు. కానీ కొన్నిసార్లు చిన్న చిన్న పొరపాట్లు కూడా జీవితాంతం గుర్తుండిపోయేలా చేస్తాయి. మమిత బైజు విషయంలోనూ సరిగ్గా ఇదే జరిగింది. ఆమెకు తల్లిదండ్రులు మొదట పెట్టాలనుకున్న పేరు నమిత. అయితే జనన ధ్రువీకరణ పత్రంలో జరిగిన ఓ చిన్న తప్పిదం కారణంగా ఆ పేరు కాస్తా మమితగా మారిపోయింది. ఈ విషయాన్ని మమిత ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది.

సాధారణంగా పిల్లలకు పేరు పెట్టే విషయంలో తల్లిదండ్రులు ఎంతో ఆలోచిస్తారు. తమకు నచ్చిన పేరును ఎంతో ఇష్టంగా ఎంపిక చేసుకుంటారు. కానీ కొన్నిసార్లు చిన్న చిన్న పొరపాట్లు కూడా జీవితాంతం గుర్తుండిపోయేలా చేస్తాయి. మమిత బైజు విషయంలోనూ సరిగ్గా ఇదే జరిగింది. ఆమెకు తల్లిదండ్రులు మొదట పెట్టాలనుకున్న పేరు నమిత. అయితే జనన ధ్రువీకరణ పత్రంలో జరిగిన ఓ చిన్న తప్పిదం కారణంగా ఆ పేరు కాస్తా మమితగా మారిపోయింది. ఈ విషయాన్ని మమిత ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది.పుట్టిన సమయంలో తన తల్లిదండ్రులు నమిత అనే పేరును నిర్ణయించారని,

చివరకు ఆమె కూడా నన్ను మోసం చేసింది

యూట్యూబర్, నటుడు ప్రసాద్ బెహరా తన జీవితంలోని కొన్ని చీకటి అధ్యాయాలను, ముఖ్యంగా విడాకుల అనంతర కాలంలో తాను అనుభవించిన ఒంటరితనం, ఆ తర్వాత ఒక పనిమనిషి వల్ల ఎదురైన నమ్మక ద్రోహం గురించి ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఈ అనుభవాలు తన జీవితం, మనుషులపై నమ్మకం, ఆర్థికపరమైన దృక్పథాన్ని ఎలా మార్చివేశాయో స్పష్టం చేశారు. విడాకుల తర్వాత తాను తీవ్రమైన ఒంటరితనాన్ని ఎదుర్కొన్నానని ప్రసాద్ బెహరా తెలిపారు. ఈ పరిస్థితిలో తనకు తోడుగా, వినోదంగా ఉండేందుకు ఒక పనిమనిషిని నియమించుకున్నానని చెప్పారు. సాధారణంగా రూ. 3,000 జీతం అడిగిన ఆమెకు, తాను రూ. 6,000 జీతం ఇచ్చానని, తనతో మాట్లాడుతూ, తన వీధిలో జరిగిన కథలు చెప్పాలని కోరానని వివరించారు. ఆమెను కుటుంబ సభ్యురాలిగా చూసుకుంటూ, వారానికి ఒక కేజీ మటన్ కొనివ్వడం, వారానికి నాలుగు రెగ్యులర్ సీట్ల సినిమా టికెట్లను ఆమె కుటుంబ సభ్యులందరికీ ఇప్పించడం, సరుకులు, బియ్యం వంటివి కూడా స్వైప్ చేసి కొనిచ్చానని ప్రసాద్ పేర్కొన్నారు. ఆమెకు పని చాలా తక్కువ ఉండేదని, కేవలం ఇల్లు శుభ్రం చేసి, పాత్రలు తోమి, తనతో మాట్లాడుతూ ఉండటమే ఆమె పని అని ఆయన చెప్పారు.అయితే, ఒకరోజు తన ఖరీదైన వాచీలు -- నాలుగు కాస్ట్లీ వాచీలతో



పాటు ఒక ఆపిల్ వాచ్ -- కనిపించకుండా పోయాయని ప్రసాద్ బెహరా చెప్పారు. ఆపిల్ వాచ్‌ను ఆమె చీర కొంగున కట్టుకొని వెళ్తుండగా, సెక్యూరిటీ బజర్ మోగడంతో ఆమె దొరికిపోయిందని ఆయన వివరించారు. ఈ సంఘటన తర్వాత, ఆమె దొంగతనం వల్ల పశ్చాత్తాపపడకుండా, ఆ వస్తువులను కొన్న వ్యక్తి తనకు కేవలం రూ. 400 మాత్రమే ఇచ్చాడని ఆవేదన వ్యక్తం చేసిందని ప్రసాద్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ విషయం తనకు తీవ్రమైన ఆవేదన కలిగించిందని, "నాలా చూసుకునే తమ్ముడు నీకు దొరికితే వాడిని తీసుకురా, నీ తమ్ముడు కూడా నిన్ను అలా చూసుకొని ఉండడు" అని ఆమెతో చెప్పి, తన ఇంటి నుంచి వెళ్ళిపోవాలని కోరానని ఆయన గుర్తు చేసుకున్నారు.ఈ ఘటన ప్రసాద్ బెహరా జీవితంపై తీవ్ర ప్రభావం చూపిందని, అప్పటి నుంచి మనుషులను నమ్మడం మానేశానని తెలిపారు. ఇప్పుడు ఎవరైనా ప్రేమగా పలకరించినా, ఆహారం ఇచ్చినా

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224